Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.12

October 2024



సంపాదకీయం

# పవర్ హౌస్



1949వ సం॥లో ప్రొఫెసర్ ఇనాక్‌గారు వైజాగ్ నుండి మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజికి బదిలీ అయ్యారు. అదే సంవత్సరం ఒక శుక్రవారం సాయంత్రం తన గృహంలో ప్రార్థనా కూడిక జరిగింది. క్రమంగా జరిగే ఈ కూడికకు వచ్చే వారి సంఖ్య కూడా పెరిగి వారిలో ప్రేమ, ఐక్యత, ఆత్మీయత ఉండేవి. ఇవి వారి పరిచర్యకు శక్తినిచ్చే సమావేశాలుగా ఉండేవి. ఈ ప్రార్థనా కూడికను మన మాజీ నేషనల్ స్టాఫ్ పిసి వర్గీస్‌గారు 'పవర్ హౌస్' అని పిలిచేవాడు.

1948వ సం॥లో సియంసి వెల్లూరులో 'స్టూడెంట్స్ క్రిష్టియన్ మూమెంట్'తో (యస్‌సియం) అసంతృప్తి చెందిన ఆరుగురు గురు విద్యార్థులు ఇంకా లోతైన సహవాసం అవసరమని భావించి తమ కళాశాలలో ఒక చిన్న ప్రార్థనా సమూహాన్ని ప్రారంభించారు. తర్వాత తమ కళాశాలలో క్రీస్తు కోసం శక్తివంతమైన సాక్ష్యాన్ని లేవనెత్తారు.

1949వ సం॥లో మద్రాస్ విద్యార్థి జయపాల్ కోయంబత్తూరులోని గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో బిటెక్ రెండవ సంవత్సరం చేరి జిటిసి హాస్టల్లో ఒక ప్రేయర్ సెల్ ప్రారంభమవ్వాలని పొలాల్లోకి వెళ్ళి భారంగా ప్రార్థించాడు. ఫలితంగా మద్రాస్ ఇయు విద్యార్థిగా ఉన్న హెచ్.యస్. పొన్నురాజును దేవుడు ఇక్కడికి పంపాడు. ఇతను జిటిసి హాస్టల్లో చేరాడు. వీరిద్దరు ఒక ప్రేయర్ సెల్‌ను ప్రారంభించారు.

మద్రాసు, సియంసి వెల్లూరు, కోయంబత్తూరు ఈ మూడు ప్రాంతాల్లోని చిన్న ప్రార్థనా గుంపులు కలిసి 1954వ సం॥ సెప్టెంబర్ 18న వెల్లూరుకు సమీపంలోని కాట్పాడి (కసమ్) అనే ప్రదేశంలో సమావేశమై 'యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' (యుఇయస్ఐ) అనే సంస్థను స్థాపించారు. యుఇయస్ఐ ప్రారంభమైంది ప్రార్థన ద్వారానే. వారి ప్రార్థనా సమావేశాలు 'పవర్ హౌస్' లాంటివి. ఈ పవర్ హౌస్‌లు అనతి కాలంలోనే భారతదేశం అంతటా విస్తరించి ఒక చరిత్రను సృష్టించాయి.

1996వ సం॥లో నేను తెనాలి ఇయు విద్యార్థిగా, తెనాలిలో ప్రతి వారం జరిగే బైబిల్ స్టడీలు, ప్రార్థనా మీటింగ్స్‌తో పాటు ప్రతి నెల రెండవ శనివారం క్రమంగా జరిగే ఆల్‌నైట్ ఫాస్టింగ్ ప్రేయర్స్ నా జీవితంలో మరచిపోలేనివి. గ్రాడ్యుయేట్స్ ఉన్నా వీటిని విద్యార్థులే నిర్వహించేవారు. రాత్రి 8:30 నుండి తెల్లవారి 4:00గం॥ల వరకు జరిగేవి. 30-40మంది వచ్చేవారు. ఎంతసేపు ప్రార్థించినా ఇంకా చేయాలనిపించేది. టైమ్ చూసుకోవడం, విసుగు, అలసట, నిరాశక్తత, నిద్రాభారం అస్సలు ఉండేవి కాదు. అందరూ భారంగా, కన్నీటితో నశించేవారికోసం, దేశంకోసం, యుఇయస్ఐ, స్థానిక పరిచర్య కోసం ప్రార్థించేవారు. సంతోషంగా పాటలు పాడేవారు, సహవాసంలో ఆనందించేవారు. ఆ ఆల్‌నైట్ ప్రేయర్స్ మా అందరి జీవితాల్లో ఒక 'పవర్‌హౌస్'లా ఉండేవి. ఆల్‌నైట్ ప్రేయర్ నుండి తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు మొబైల్‌కి ఫుల్ ఛార్జింగ్ ఉన్నట్లు మేము అలా వచ్చేవాళ్ళం. ఫలితంగా విద్యార్థులు గొప్ప సమర్పణతో, పరిశుద్ధ జీవితాన్ని జీవిస్తూ, ప్రభువు పనిలో ప్రయాసపడేవారు.

నేడు మన ఇయు, ఇజియఫ్‌లలో జరిగిస్తున్న ప్రార్థనా సమావేశాలు శక్తిని పొందుకొనే పవర్ హౌస్‌లుగా ఉంటున్నాయా? లేక పవర్ లెస్‌గా ఉంటున్నాయా? ఒక ఇయు, ఇజియఫ్ శక్తివంతంగా ఉండాలంటే ప్రార్థనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. విశ్వాసులుగా మన స్వంత శక్తి లేదా వనరులతో పవిత్రంగా, నీతిగా జీవించ లేము, ప్రభువు పనిని అంతకన్నా చేయలేము. దేవుడే విశ్వాసి యొక్క అత్యున్నతమైన శక్తి. ఆయనమీద ఆధారపడకుండా, ఆయనకు వేరుగా మనమేమీ చేయలేము (యోహాను 15:5). "ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మిక కార్యాలు చేయగలమని భావించినప్పుడు మనం దారితప్పిపోతాం" అని అంటాడు ఏడబ్ల్యు టోజర్. గనుక వ్యక్తిగతంగా, మన ఇయు, ఇజియఫ్‌లలో ప్రార్థనా సమావేశాల్ని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రార్థన పట్ల ఆసక్తి తగ్గిపోతే యుఇయస్ఐ పరిచర్య, మన ఆత్మీయ స్థితి దిగజారి పోతున్నట్లే.

ఈ ఇంటర్నెట్ యుగంలో, కోవిడ్ తర్వాత పరిస్థితుల్లో, పరిచర్యలో, పనిలో, ప్రార్థనలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. వ్యక్తిగత ప్రార్థనా జీవితం తగ్గిపోవడం, ప్రార్థనకు సమయాన్ని కేటాయించలేకపోవడం, సహవాస ప్రార్థనలకు హాజరు క్రమంగా క్షీణించడం...లాంటి విషయాల్ని గుర్తించి ప్రతి సభ్యునిలో ప్రార్థనాసక్తిని రగిలించాలని యల్‌ఆర్‌పి-2030లో ప్రథమ ఫోకస్ ఏరియాగా 'ప్రార్థన పట్ల ఆసక్తిని పెంపొందిద్దాం' అనే అంశాన్ని ఉంచారు. దీని గురించి మరింత తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరం ఉన్నత శిఖరాలకు అనే యల్‌ఆర్‌పి మ్యాన్యువల్‌ను చదువుదాం. వ్యక్తిగతంగా, ఇయు, ఇజియఫ్‌లలో ప్రార్థనకు ప్రాముఖ్యతనిద్దాం.

ఏ కాలంలోనైనా దేవుని కొరకు గొప్ప కార్యాలు చేసిన వారు, దేవుని ఉద్దేశాల్ని నెరవేర్చిన వారందరూ గొప్ప ప్రార్థనా పరులే. మన తరంలో దేవుని కొరకు గొప్ప కార్యాలు చేయాలన్నా, మన ద్వారా దేవుని ఉద్దేశాలు నెరవేరాలన్నా మనం కూడా గొప్ప ప్రార్థనా పరులం కావాల్సిందే.

– పి. సునీల్ జాకబ్, అసోసియేట్ ఎడిటర్




Vol. 30, No. 12 October 2024
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod, Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCPRICTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account No: 36698741798**
**Account Name: uesiap vj**
**IFS Code: SBIN0011994**
**SBI Nambur Branch**

**UPI ID: uesiapvj@sbi**

CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

UPCOMING TOPIC:

November: Discipleship
December: Christmas

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# విజ్ఞాపన విశిష్టత



విజ్ఞాపన అంటే ఒక విశ్వాసి ఒక వ్యక్తి, సమాజ పక్షంగా వేడుకోవడం, వారి క్షేమంకోసం తపించడం, నాశనం జరగకుండా ప్రార్థనలో అడ్డుపడడం. అక్కరలో ఉన్న ప్రజలకు, అక్కరలను తీర్చే ప్రభువుకు మధ్య అనుసంధానకర్తగా నిలబడి, ప్రజల కొరకు ప్రార్థించడం. విజ్ఞాపన చేసేవారు ఈ ఐదు లక్షణాలను కలిగి ఉంటారు.

1. **ప్రేమిస్తారు:** తమ పూర్ణ శక్తితో దేవునిని, తమ పొరుగువారిని ప్రేమిస్తారు. ప్రేమించినప్పుడు వారి చెడును, నాశనాన్ని చూడలేరు.
2. **స్వార్థముండదు:** తమ సమయాన్ని ప్రార్థనలో ఇతరుల కొరకు కేటాయించడం అనేది స్వార్థం లేకపోవడమే. తన క్షేమం కన్నా ఇతరుల క్షేమాన్ని కాంక్షించేవారుగా ఉంటారు.
3. **దేవుని మనస్సు ఎరిగిన వారు:** ఏ విషయాల్ని చూసి దేవుడు నొచ్చుకొంటాడో, ఏవి దేవునికి దు:ఖాన్ని కలిగిస్తాయో, ఏవి దేవుని హృదయాన్ని బ్రద్దలు చేస్తాయో విజ్ఞాపకుడు కూడా అలానే భావిస్తాడు, అదే భారాన్ని కలిగి ఉంటాడు.
4. **ప్రాణాల్ని త్యజించడానికి సిద్ధంగా ఉంటారు:** మోషే (నిర్గమ 32:32); ఎస్తేరు (ఎస్తేరు 4:16)
5. **కన్నీరు కారుస్తారు:** నెహెమ్యా, పౌలు

## లోపలి పేజీల్లో...

- పవర్‌హౌస్ - 2
- సహృదయంతో సహవాసానికి సవాలు - 4
- ప్రార్థనలో ప్రజ్వలిల్లు - 5
- రండి! ప్రార్థన చేద్దాం - 8
- ప్రేయింగ్ హైడ్ - 11
- కాగుతున్న కాగడా - 13
- రక్షణ - 14
- ప్రార్థన పరిస్థితులను మార్చి, ప్రభావం చూపేలా చేసింది - 17
- కీలక వ్యూహం - 20
- సాతాను తంత్రాలు - 21
- మీరు లోకానికి ఉప్పు - 25
- కన్నులెత్తి పైరుల చూడు - 29
- వరదల్లో విలవిల - 31
- ఏడు దశాబ్దాల సజీవ సాక్ష్యం- 32

# సహృదయంతో...
# సహవాసానికి సవాలు

"కాలేజ్ పార్టీలో అందరికీ నిక్‌నేమ్స్ ఇచ్చేవారు. ఆయన ధృఢ విశ్వాసాన్ని చూసి అందరూ ఆయనను డా. బిల్లీగ్రేహం అని పిలిచేవారు". జెహోవా షమ్మాలో ప్రొఫెసర్ ఇనాక్ గారి అంత్యక్రియల సందర్భంగా కొంతమంది వెలిబుచ్చిన అభిప్రాయాల్లో ఇది ఒకటి. 3 ఏప్రిల్ 1988వ సంవత్సరంలో తనువు చాలించిన ఇనాక్ గారు 82 సంవత్సరాల 8 నెలల 10 రోజులు జీవించి ఇప్పటికీ మన హృదయాల్లో జీవిస్తూనే ఉన్నారు. పుట్టిన ప్రతి ఒక్కరూ కొంతకాలమైనా జీవించాలి. ఈ జీవితంలో జీవితాన్ని ప్రసాదించిన ప్రభువు ప్రణాళికలు నెరవేర్చాలి.



82 ఏళ్ళకే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సువార్తికున్ని అనుసరించిన ఇనాక్ గారి జీవితాన్ని పరిశీలిస్తే ఆ ప్రత్యేకమైన, ప్రభావవంతమైన జీవితానికి ప్రధాన కారణం ప్రభువుని అమితంగా ప్రేమించడమే. ప్రభువే తన జీవితంలో ప్రథమ ప్రాధాన్యత అనే విషయం తన 20 ఏళ్ళ వయస్సులోనే అని మనకు అర్థం అవుతుంది. ఈ వయస్సు నుండే కొండమీద ప్రసంగాన్ని అధ్యయనం చేసి, అభ్యాసం కూడా ప్రారంభిం చడం మనందరికీ గొప్ప ప్రోత్సాహం, సవాలు. ఒక వ్యక్తి తన వయసుకు మించి ఇతరులను ప్రేమించాలన్నా, ప్రభావం చూపాలన్నా పరిశుద్ధ లేఖనాలను ప్రేమతో పఠించడంతోపాటు శ్రద్ధగా పాటించాలి. ఈ రెండూ ఇనాక్ గారి జీవితంలో విడదీయలేనివి. వాక్యం యొక్క విషయ పరిజ్ఞానంతో పాటు, ఆ వాక్యానికి విప్లవాత్మక విధేయత చూపించిన వ్యక్తిగా ఇనాక్ గారిని చూస్తాం.

మౌళిక విలువలు, పితరుల జీవనశైలి కొరవడుతున్న ఈ రోజుల్లో మనం తప్పక మనసు పెట్టాల్సిన విషయం – మన పితరులను పోలి జీవించడమే. యుఇయస్ఐ 70 వసంతాలు పూర్తి చేసుకొన్న చారిత్రక సందర్భంలో మన సహవాసంలో అందరూ రానున్న రోజుల్లో ప్రొఫెసర్ ఇనాక్ గారిలా బ్రతికేందుకు సమర్పించుకొందాం. ఈ సవాలును సహృదయంతో మన సహవాసమంతా స్వీకరిస్తే అధునిక ఇనాక్‌లు ఆవిర్భవిస్తారు.

20వ శతాబ్దంలోనే క్రీస్తులా జీవించేందుకు మన ఇనాక్ గారికి సాధ్యమైతే, ప్రస్తుత మన తరానికి కూడా సాధ్యమవుతుంది. ఈ ప్రత్యేకమైన సంవత్సరాన్ని పురస్కరించుకొని మనమంతా అలా బ్రతకడానికి పునరంకితం చేసుకొందాం. ప్రస్తుత కళాశాల విద్యార్థులను నిత్యత్వం కోసం గెలుచుకొందాం. ఇట్టి ప్రత్యేకమైన కృప మన యుఇయస్ఐ కుటుంబ సభ్యులందరికీ దయచేయాలని ప్రార్థిస్తూ...

ఇనాక్ గారి నిక్‌నేమ్ డా. బిల్లీగ్రేహం అయితే నీ/నా నిక్‌నేమ్ ఏంటి?

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




# ప్రార్థనలో ప్రజ్వరిల్లు

## అసాధారణ జీవితం, సత్యవంతుని సారూప్యం కోసం...

"ప్రపంచాన్ని మార్చడానికి నీ ప్రార్థనలు దేవుణ్ణి కదిలిస్తాయి. ప్రార్థనా మర్మాన్ని నీవు అర్థం చేసుకోకపోవొచ్చు. చేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఇది స్పష్టం. భూలోకంలో ఎవరో ఒకరు ప్రార్థిస్తే పరలోకంలో పనులు ప్రారంభమౌతాయి" అని అంటాడు మాక్స్ లుకాడో అనే దైవజనుడు.

దేవునితో గడిపే సమయమే సద్వినియోగమైన సమయం. పదిమంది ప్రసంగీకుల కంటే ఒక ప్రార్థనాపరుడు మిన్న అన్నాడో భక్తుడు. సువార్తల్లో యేసు జీవితం (లూకా 6:12; 21:37; మార్కు 1:35) ఆయన ప్రార్థనా జీవితాన్ని, తండ్రితో సమయాన్ని గడపడానికిచ్చిన ప్రాధాన్యతను వివరిస్తాయి. వీటిని పరిశీలించినప్పుడు క్రీస్తు సంపూర్ణ మానవత్వాన్ని, తగ్గింపు జీవితాన్నే గాక, దేవునిపై మనం ఆధారపడి జీవించాల్సిన అవసరాన్నే ఎక్కువగా నొక్కి వొక్కాణిస్తున్నాయి.

యేసును అనుకరించిన పౌలు జీవితం పరిశీలిస్తే (1 కొరింథీ 11:1) ప్రార్థనా నమూనా మనకు స్పష్టంగా అర్థమౌతుంది. మిగతా అంశాలతోపాటు విశ్వాసుల ఆత్మీయ క్షేమాభివృద్ధి కోసం అతడు చేసే ప్రార్థనలు (ఎఫెసీ 3:14-21) ప్రస్తుత విశ్వాసులకు ముఖ్యంగా నాయకులకు ఎంతో ఆదర్శం. ఎందుకంటే మనకున్నంత పూర్తి బైబిల్ లేదు. స్టడీ బైబిల్స్, ట్రాన్స్‌లేషన్స్, మిషనరీ జీవిత చరిత్రలు, అపోస్తలుల చరిత్ర, హతసాక్షుల వివరాలు, డి.యల్.మూడీ, జాన్‌వెస్లీ, చార్ల్స్‌వెస్లీ, ప్రేయింగ్ హైడ్, భక్తసింగ్, బిల్లీగ్రేహం మొదలగు ఆదర్శవంతమైన నాయకుల్ని తను చూడలేదు. అతడే చరిత్రలో మొదటి తరం క్రైస్తవుడు. ప్రార్థనా ప్రాముఖ్యత కోసం మనం విన్నన్ని ప్రసంగాలు విని ఉండడు. అయినా గొప్ప ప్రార్థనా పరుడిగా, క్రీస్తునే పోలిన నాయకుడుగా పౌలు ఎదిగాడు.

మన ప్రధాన లక్ష్యం – మన ప్రార్థనలో మన కోరికలు నెరవేర్చుకోవడం కాదు గానీ, ప్రార్థనలో ప్రజ్వరిల్లుతూ, సత్యవంతుని స్వరూపంలోకి మారడమే.

దేశానికి ప్రాతినిధ్యం వహించే పివి సింధు, నీరజ్ చోప్రా లాంటి వారే దేశ ప్రతిష్ట కోసం (తమ వ్యక్తిగత ప్రగతి, లాభం కోసం కూడా) రోజులో 6 నుండి 7 గంటలు క్రమం తప్పకుండా అభ్యాసం చేస్తుంటే, దేవునికి ప్రాతినిధ్యం వహించే మనం కనీసం 3 నుండి 4 గంటలైనా ఆయన సన్నిధిలో గడపలేకపోతే మన ద్వారా ఆయన ఏమీ సాధించలేడు.

యేసుకు శిష్యులమని చెప్పుకొంటున్న మనం ఆయన రాత్రంతా ప్రార్థిస్తే – కనీసం అర్థరాత్రి వరకైనా ప్రార్థించాలి. వేకువనే ఆయన లేస్తే మనం కూడా అలా ఆయన సన్నిధిలో తృప్తిగా గడపాలి. సాక్షాత్తూ దేవుడే ప్రార్థిస్తే మనం తప్పక ప్రార్థించాలి.

ఒక విద్యార్థి అన్ని వనరులుండి చదవకపోవడం, ఒక ఉద్యోగి అన్ని సదుపాయాలుండి ఆఫీస్‌లో



**ఇంటితో పోలిస్తే తలుపు చాలా చిన్నది. తలుపుతో పోలిస్తే తాళం చాలా చిన్నది.**
**తాళంతో పోలిస్తే తాళపు చెవి చాలా చిన్నది. కానీ చిన్న తాళపు చెవితో ఇల్లంతా స్వాధీన పరచుకోవచ్చు.**
**ఆ తాళపు చెవి నీ ప్రార్థనే. పెద్ద సమస్య అయినా, పరిష్కారం చిన్న ప్రార్థనే.**

సరిగా పని చేయక పోవడం, ఒక వ్యక్తి సువార్త స్పష్టంగా తెలిసినా యేసుని రక్షకునిగా అంగీకరించక పోవడం పాపం అయితే, యాకోబు 4:17, 1 సమూ 12:23 ప్రకారం ప్రార్థన వ్యక్తిగతంగా, సహవాసంగా ఆశీర్వాదాన్ని ఇస్తుందని, దేవుని ఆజ్ఞ అని, తప్పక చేయాలని తెలిసి కూడా కనీసం 3 గం॥లు ఆయన సన్నిధిలో గడపక పోవడం పాపమే. వ్యభిచారం, దొంగతనం, నరహత్య మొ॥నవి చేయకూడనివి కాబట్టి చేయము. చేయాల్సిన ప్రార్థన చేయక పోవడం కూడా అంతే మరి.

## ప్రార్థన లేమికి కారణాలు

- ❖ భూలోక జీవితాన్నే ప్రాధాన్యతగా ఎంచడం.
- ❖ మౌనధ్యాన సమయంతో సహా కనీసం 3 గం॥లు ఆయన సన్నిధిలో గడపలేకపోవడం.
- ❖ చిన్న విషయాలకే అసాధారణ కోపం రావడం, కోపపడాల్సిన విషయాల్లో ఊగిపోతూ మాట్లాడడం.
- ❖ తమకు వ్యతిరేకంగా చెప్పిన/చేసిన వారిపై దీర్ఘకాలం కోపాన్ని ప్రదర్శించడం, మనసులో కక్ష పెట్టుకోవడం.
- ❖ సమయాను సందర్భంగా సత్యం చెప్పడానికి వెనుకంజ వేయడం.
- ❖ బైబిల్ విలువల కంటే లోక మర్యాదలకు ప్రాధాన్యత ఇవ్వడం.
- ❖ ఇతరుల లోపాలను ఎత్తి చూపడం.
- ❖ ఇతరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వక, ఎప్పుడూ తమ అభిప్రాయాన్నే అందరూ ఆమోదించాలని అనుకోవడం.
- ❖ ఇతరులను గాయపరిచే విధంగా మాట్లాడడం.
- ❖ స్థానిక ఇయు, ఇజియఫ్ సభ్యుల కోసం క్రమంగా ప్రార్థించకపోవడం.

## ప్రార్థనాపరుల్లో కనిపించే లక్షణాలు

- ❖ నిర్దిష్ట సమయాన్ని, క్రమశిక్షణను పాటిస్తూ కనీసం 3 గంటలు ప్రతిరోజు ఆయన సన్నిధిలో గడపడం. వ్యక్తిగత, కుటుంబ అవసరాలు, ఇయు/ఇజియఫ్ సభ్యుల ఎదుగుదల, జిల్లా, రాష్ట్ర, దేశ పరిచర్య అవసరాలు. తెలిసిన దైవజనుల కోసం, దేశంలో సువార్త, ఉజ్జీవం కోసం, బంధువుల, స్నేహితుల రక్షణ మొదలగు అంశాలు.(ఇలా చేయడం క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లో కష్టం కావచ్చు).
- ❖ యస్‌యంయస్, వాట్సాప్‌లో ప్రార్థనావసరతలు వచ్చినప్పుడు వెంటనే ప్రార్థించడం/సమయాన్ని కల్పించుకొని ప్రార్థించడం.
- ❖ వ్యక్తులను బలపరచి వారి ఎదుగుదలను కాంక్షించే ఉద్దేశంతో సరిచేసి, సలహాలివ్వడం.
- ❖ ప్రేమతో సత్యం చెప్పడం.
- ❖ ఎంతటి విపత్కర పరిస్థితినైనా ప్రభువు కృప ద్వారా చిరునవ్వుతో, సానుకూల దృక్పథంతో ఎదుర్కోవడం, సమస్యను పరిష్కరించడం.

ఇంటితో పోలిస్తే తలుపు చాలా చిన్నది.
తలుపుతో పోలిస్తే తాళం చాలా చిన్నది.
తాళంతో పోలిస్తే తాళపు చెవి చాలా చిన్నది.
కానీ చిన్న తాళపు చెవితో ఇల్లంతా స్వాధీన పరచుకోవచ్చు.
ఆ తాళపు చెవి నీ ప్రార్థనే.
పెద్ద సమస్య అయినా, పరిష్కారం చిన్న ప్రార్థనే.

- ❖ బహిరంగ తిరస్కారాన్ని, నిందను కూడా అంగీకరించి మరింతగా ఆయనలో ఎదగడానికి, అనేకులకు ఆదర్శంగా, ఆశీర్వాదంగా మారేందుకు దేవుడిచ్చిన సదవకాశంగా భావించడం.
- ❖ కోపాన్ని సెకన్స్‌లో (గంటల్లో, నిమిషాల్లో కాదు) అదుపులో పెట్టుకుంటూ ఆయనకు మహిమకరంగా జీవించడం.
- ❖ దేశ, రాష్ట్ర పరిస్థితుల కోసం తక్కువ సమయం ప్రార్థించినా, స్థానిక ఇయు, ఇజియఫ్ సభ్యుల కోసం పేరు పేరున ప్రార్థించడం.

- ఇతరుల వ్యక్తిత్వాలతో సంబంధం లేకుండా ఎవరితోనైనా సంతోషంగా కలిసి (కొన్నిసార్లు అభిప్రాయ బేధాలొచ్చినా) పని చేయడం.
- తమను వ్యతిరేక దృక్పథంతో చూసే వారి ఆశీర్వాదం కోసం మరింత ప్రేమతో, పట్టుదలతో ప్రార్థించడం.
- పరిచర్యలో ప్రేమ, ఐక్యత, పవిత్రత, ప్రార్థనలకు ప్రాధాన్యతనిచ్చే వారు కొనసాగాలని, కొత్తవారు లేవాలని ప్రార్థనలో కోరుకోవడం.
- విప్లవాత్మక క్రైస్తవ జీవితాన్ని జీవిస్తూ, తమను మించిపోయే తమ్ముళ్ళు, చెల్లెమ్మల రూపంలో ఉద్భవించాలని క్రమంగా కోరుకోవడం.
- మన నాయకులకు మనమిచ్చే శ్రేష్టమైన బహుమానాలు ప్రార్థనలే.

## ఆలోచన కొరకు

తెలివైన విద్యార్థి ఒకసారి పరీక్షలో ఫెయిల్ అయి నా అలానే ఉండిపోకుండా ప్రయత్నిస్తాడు.

ఆశగల నిరుద్యోగి ఒక కంపెనీలో ఉద్యోగం రాకపోయినా మరో చోటైనా ఉద్యోగవేట కొనసాగిస్తాడు.

అనుకూల దృక్పథం గల క్రీడాకారుడు కొన్నిసార్లు ఓడిపోగానే ఆ క్రీడకు స్వస్థి చెప్పకుండా ఇంకా రాణించడానికి అహర్నిశలూ శ్రమిస్తాడు.

దేవునిపై విశ్వాసముండి, ఆయన ప్రణాళిక నెరవేర్పు (రాజ్యవ్యాప్తి) కోసం ఏదైనా సాధించాలనుకున్న విశ్వాసులు పట్టుదలతో కూడిన ప్రార్థనలో ఇంతవరకూ చాలాసార్లు విఫలమైనా (ఫర్వాలేదు), విరమించక పట్టుదలతో కొనసాగించాలి ఎందుకంటే...

"విజేతలెవరూ మధ్యలో వదిలేయరు. మధ్యలో వదిలేసిన వారు విజేతలు కాలేరు".

ప్రపంచ విజేత అయిన మన ప్రభువు ఆశయం నెరవేర్పు కొరకు, ఎన్నిసార్లు విఫలమైనా – మనం పూర్తిగా విరమించే వరకూ అది విఫలం కాదు. విజయమో – వీరస్వర్గమో అన్నట్లు ఈ లోకంలో మన మరణం మాత్రమే ప్రార్థనను విరమింపజేయాలి తప్ప మనం కాదు. ఏదైనా కారణంచేత కొన్ని రోజుల్లో ఒకసారి మాత్రమే భోజనం చేస్తే ప్రతిరోజూ ఒక పూటతోనే సరిపెట్టుకోము కదా. ప్రార్థన విషయంలోనూ అంతే.

## స్వపరీక్ష

మనం మారుమనస్సు పొందిన దగ్గర నుండి లెక్కించాల్సిన సంవత్సరాలు – మనముండాల్సిన స్థితి.

3 నుండి 5 సం॥ల వయస్సులు రోజులో కనీసం 2 గంటలు ప్రార్థించ లేకపోతే – వీరు ప్రార్థనా ప్రాముఖ్యతను విని అర్థం చేసుకొన్నవారు కాదు. ఒకవేళ అర్థం చేసుకున్నా ప్రయోగాత్మక క్రైస్తవులుగా, ప్రభావవంతంగా మారలేదు.

5 నుండి 10 సం॥ల వయసున్నా రోజుకి కనీసం 3 గం॥లు ఆయనతో గడప లేకపోతే వీరు సాధారణ క్రైస్తవ్యాన్ని, అంటే పేరుకు మాత్రమే క్రైస్తవులుగా జీవిస్తున్నారు (1 తిమో 2:1–3 వీరికి అర్థం కాలేదు).

వివాహమై పిల్లలింకా లేనివారు కనీసం 3 గం॥లు ప్రార్థనలో గడపకపోతే వీరి ద్వారా దేవుడు ఏమీ సాధించడు.

పిల్లలను తయారు చేసి స్కూల్‌కు పంపించే వారు కనీసం 2 గం॥లు ఆయనతో గడపకపోతే వీరిని దేవుడు వాడుకోక పోవచ్చు.

పిల్లలకు కావాల్సినవన్నీ అమర్చినా, శారీరకంగా స్నానం లాంటివి చేయించాల్సిన అవసరం లేని తల్లిదండ్రులు 3 నుండి 4 గం॥లు ప్రభువు సన్నిధిలో గడప లేకపోతే – వీరు వయసుకు తగిన జీవితాన్ని జీవించలేరు, దేవుని పరిచర్య చేయలేరు.

విఆర్‌యస్/రిటైర్డ్ విశ్వాసులు కనీసం 4 గం॥లు (వాక్య ధ్యానం, ప్రార్థనల్లో) రోజులో గడపకపోతే ప్రభువు దృష్టిలో క్షమించరాని నేరమౌతుందేమో. మన ప్రార్థనలు అన్నీ ఆయన దగ్గర నుండి ఆశించడమేనా? మన ద్వారా ప్రపంచ ఆశీర్వాదం కోసం ఒక ప్రార్థనాపరుణ్ణి బహుమానంగా ఆయనకు అందివ్వలేమా? అనేది మన చేతుల్లోనే ఉంది.

ప్రార్థనలో ప్రజ్వరిల్లడమా? సాధారణంగా జీవించడమా? సత్యవంతుని స్వరూపంలోకి మారడమా? అనేది మన చేతుల్లోనే ఉంది. అది ప్రభువు మన చేతుల్లో ఉంచాడు.

– ఆర్. శ్రీనివాస్
స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# రండి! ప్రార్థన చేద్దాం

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాల మది. అడాల్ఫ్ హిట్లర్ ప్రపంచ విజేత కావడానికి కొద్ది దూరంలో ఉన్నాడు. జర్మనీ సైన్యం ఐరోపా ఖండంలోని రాజ్యాలను జయిస్తూ దూసుకుపోతుంది. 1940 మే నెలలో బ్రిటిష్ సైన్యం, దాని మిత్రపక్షాలు ఫ్రాన్స్ దేశపు ఉత్తర భాగములోనున్న డన్‌కిర్క్ ఓడరేవు ప్రాంతమునుండి జర్మనీ సైన్యాన్ని ఎదిరించుటకు సన్నాహాలు చేస్తున్నారు. అదే సమయంలో జర్మనీ సైన్యం, బ్రిటిష్ సైన్యాన్ని మూడు వైపులనుండి ముట్టడించింది. నాలుగోవైపు సముద్రం. పారిపోయే అవకాశం కూడా లేని విధంగా జర్మనీ సైన్యంచే బ్రిటిష్ సైన్యం దిగ్బంధం చేయబడింది. దిక్కు తోచని స్థితి. అలాంటి విషమ పరిస్థితిలో చేసేదేమీ లేక అప్పటి బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ 'మన 3 లక్షల సైన్యం జర్మనీ సైన్యం చేతిలో పట్టుబడవచ్చు లేదా చంపబడవచ్చు' అనే సమాచారాన్ని మీడియా వారికి ఇవ్వడానికి సిద్ధపడుతున్నాడు. అదే సమయంలో అప్పటి బ్రిటిష్ రాజు కింగ్ జార్జ్ VI, రండి ప్రార్థన చేద్దాం, అని జాతీయ ప్రార్థనా దినాన్ని ప్రకటించాడు. ప్రజలంతా సంఘాల ముందు క్యూ కట్టి ప్రార్థింప మొదలు పెట్టారు. ఎవ్వరూ తలంచని విధంగా, 'మూడు రోజులు యుద్ధాన్ని ఆపండి' అని హిట్లర్ జర్మనీ సైన్యాన్ని ఆదేశించాడు. విజయోత్సాహంతో ముందుకు దూసుకుపోతున్న జర్మనీ సైన్యాధ్యక్షులకు ఏమీ అర్థం కాలేదు. హిట్లర్ ఆదేశానుసారంగా యుద్ధాన్ని మూడు రోజులు ఆపేశారు. ఒక ప్రక్కన ఉన్న సముద్రము అసాధారణ రీతిలో నిమ్మళించగా, అదనంగా వచ్చిన 800 బ్రిటిష్ నౌకలు, దిగ్బంధంలో ఉన్న మూడు లక్షలమంది బ్రిటిష్ సైనికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఎంత గొప్ప అద్భుతం! ప్రార్థనలకు జవాబుగా ప్రభువు ఈ అద్భుతాన్ని చేశారు. దీనినే **'డన్‌కిర్క్ అద్భుతం'** అంటారు. ఆ సంఘటన జరిగిన నాటి నుంచి హిట్లర్ ఓడిపోవడం ప్రారంభమై, రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఈ సంఘటన ద్వారా యుద్ధాలను ఆపగల ప్రభావం ప్రార్థనకు, ప్రార్థనలకు జవాబునిచ్చే దేవుని హస్తంలో ఉన్నదనే సత్యం ఇట్టే మనం అర్థం చేసుకోవచ్చు. ఈ సత్యం గ్రహించిన దావీదు మహారాజు "ప్రార్థన ఆలకించువాడా! సర్వశరీరులు నీ యొద్దకు వచ్చెదరు" అని ప్రార్థించాడు. మనం కూడా ప్రార్థనా ప్రభావాన్ని ఎరిగి, ఆచరణాత్మక అనుభవంలోకి ఎదిగే విధంగా కొన్ని అనుభవ సాక్ష్యాలను చూద్దాం.

దేవుడు జవాబు ఇచ్చేవరకు ఇతరుల క్షేమము, వారి అవసరాలు, ఆత్మరక్షణ కొరకు ప్రార్థన చేయాలనే బలమైన ప్రేరణను ప్రార్థనాభారం అంటాం. ఈ ప్రార్థనా భారం కలిగి ప్రార్థన చేసి జవాబులు పొంది, సమాజాన్ని ప్రభువు కొరకు ఎలా గెలిచారో, ప్రార్థనా ప్రభావ ఫలితాలను కొన్నిటిని చూద్దాం.

**అబ్రహాము** తన బిడ్డల క్షేమం కొరకు, తన ఇంట పుట్టి, లోతును విడిపించిన 318 వీరుల కొరకు ప్రార్థన చేయటమేకాక వారికి ప్రార్థన అవసరాన్ని నేర్పించాడు. విశ్వాసులకు తండ్రిగా మొదట తన గృహాన్ని ప్రార్థనా గృహంగా తీర్చిదిద్దుకున్నాడు. ప్రార్థనల ద్వారా నిరంతరం దేవునితో సంబంధం

కలిగి ఉండబట్టే దేవుడు అబ్రహామును తన స్నేహితుడని పిలుచుకోవడానికి ఇష్టపడ్డాడు. యోబు కూడా నిత్యము తన బిడ్డల కొరకు దహన బలి, ప్రార్థనలు అర్పించాడు. రండి! ప్రార్థనా గృహాలను ఏర్పరచుకొని మన బిడ్డల రక్షణ, సంరక్షణ కొరకు ప్రార్థన చేద్దాం (ఆది 18:19; 14:14).

**మోషే** ఆరు లక్షల పాదచారులను అరణ్య మార్గమున 40 ఏండ్లు నడిపించాడు. వారి ఆలనాపాలన చూసుకున్నాడు. వారికి కావల సిన అహారపానీయాలు సమకూర్చుకున్నాడు. ఇశ్రాయేలీయులకు దశ, దిశ నిర్దేశించాడు. లోబడని ప్రజల కొరకు, వారి జీవిత మనుగడ, వారి అభివృద్ధి కొరకు నిత్యం ప్రార్థించాడు. వారి అరణ్య యాత్రలో సమస్యలెన్ని ఎదురైనా ప్రార్థన చేసి పరిష్కారం పొందుకొనేవాడు. ఒక సందర్భంలో నీ గ్రంథంలో నుంచి నా పేరు తుడిచివేయుము అని తెగించి ఇశ్రాయేలీయుల కొరకు ప్రార్థించాడు. రండి ప్రార్థన చేద్దాం అని హెచ్చరించాడు. మోషేను పోలి ప్రార్థన చేద్దాం – తోటివారి జీవిత మనుగడ, అభివృద్ధి కొరకు (సంఖ్యా 11:21; 14:19; నిర్గమ 32:32).

**సమూయేలు** జీవించిన కాలంలో ప్రతివాడును తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. దేవుని యెడల భయం బొత్తిగా లేదు. సమాజంలో నీతి న్యాయాలు అడుగంటాయి. ఆ పరిస్థితులలో తాను వారి నిమిత్తం ప్రార్థన చేయకపోతే పాపం చేసినట్లు భావించి, ప్రజల కొరకు ప్రార్థించాడు. మిస్పాకు రండి, ప్రార్థన చేస్తాను. మనమంతా ప్రార్థన చేద్దాం అని చెప్పి ప్రజలందరు ప్రార్థనా ప్రభావాన్ని గుర్తించేలా చేశాడు. గనుక – రండి, ప్రార్థన చేద్దాం. ప్రజలు నీతి, న్యాయాలను, చట్టాన్ని గౌరవించేలా, ఆజ్ఞలను పాటించేలా (1 సమూ 7:5,9; 12:23).

**రాజులైన దావీదు, ఆసా, హిజ్కియా** మొదలైన వారు ప్రార్థించుట ద్వారా ప్రజలకు మంచి పరి పాలన అందించారు. శత్రు రాజులు యుద్ధానికి వచ్చినప్పుడు 'రండి ప్రార్థన చేద్దాం' అని రాజులు మొదలు సామాన్యుల వరకు యెహోవా సన్నిధికి వెళ్ళి ప్రార్థించి, విజయాలు సాధించారు. రండి ప్రార్థన చేద్దాం. దేశంలో మంత్రులు, అధికారులు మంచి పరిపాలన అందించే విధంగా.

**యెషయా, యిర్మియా** మొదలైన ప్రవక్తలు దేవుడు వారికి బయలు పరచినవి ప్రజలకు తెలియజేస్తూ దివారాత్రులు ఏడ్చి, ప్రలాపించి ప్రార్థించే వారు. ప్రజలను దేవుని తట్టు తిరగమని హెచ్చరిస్తూ తల జలమయముగాను, కన్ను కన్నీటి ఊటగాను మారేంతగా ప్రార్థించారు. రండి! ప్రవక్తల వలె ప్రార్థన చేద్దాం. సాతాను చెరలోనున్న ప్రజల విడుదల, విమోచన కొరకు.

**ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, దానియేలు** ప్రార్థనను ఆయుధంగా చేసుకొని పతనమైన జీవితాలను కట్టారు. కూల్చబడిన గోడలను తిరిగి నిర్మించారు. మరణపు కోరల్లో చిక్కుకున్న ప్రజానీకాన్ని రక్షించారు. జీవితంలో రాజీపడకుండా శరీరాలను అప్పగించి రాజ శాసనాలు రద్దయ్యేటట్లు చేశారు. సమాజాన్ని సంస్కరించారు. వారు చేసిన ప్రార్థనలకు రాజులు, అధికారులు తలొగ్గేలా చేశారు. కాబట్టి – రండి! ప్రార్థన చేద్దాం. దేవుని ప్రజల కాపుదల, సంరక్షణ, సంస్కరణల కొరకు.

**యేసయ్య** ప్రతి విషయంలోను, అన్ని సందర్భాలలోను ఆరంభం నుంచి ఆఖరి వరకు చివరి శ్వాస విడిచే వరకు ప్రార్థించారు. యేసయ్య ప్రార్థనా జీవితాన్ని అర్థం చేసుకున్న కీ.శే. ఏ.బి. మాసిలామణి గారు "ఇల బ్రతుకంతయు ప్రార్థన ప్రభుయేసునకు" అని పాట రాసి ఆయనను కీర్తించాడు. ఈ భువిలోనే కాదు, నేడు ఆ దివిలో కూడా ప్రస్తుతం మన కొరకు ప్రార్థన చేస్తున్నాడు యేసయ్య. శోధనలో ప్రవేశించకుండా మెళకువగా ఉండి ప్రార్థన చేయమని హెచ్చరించాడు. అవునా?



గనుక – రండి ప్రార్థన చేద్దాం. సర్వమానవాళి రక్షణ పొందునట్లు.

**యేసయ్య శిష్యులు** భూలోకమును తలక్రిందులు చేసేవారిగా, అద్భుతాలు చేసే అపొస్తలులుగా, ప్రపంచపు నలుదిక్కులకు సువార్తను మోసుకెళ్ళిన వారిగా ప్రసిద్ధి చెందారు. వారి జీవిత రహస్యం ఒక్కటే – ప్రార్థన, ప్రార్థన, ప్రార్థన. ఎల్లప్పుడు విసుగక నిత్యం ప్రార్థించేవారు. వారు చేసిన కార్యాలు ప్రార్థనా కార్యాలే. మీ కోసం ప్రార్థిస్తున్నాం, మా కోసం కూడా ప్రార్థించండి అని ఉత్తరాలు రాసేవారు. ప్రార్థనే వారి నాడి, వేడి, వాడి. గనుక, రండి! మనం కూడి ప్రార్థన చేద్దాం. సువార్త నలుదిక్కులా ప్రచురించబడేలా.

**మిషనరీలు** ఇతర దేశ మ్యాప్‌లను ముందు పెట్టుకొని, అక్కడి ప్రజల గురించి తెలుసుకొని ప్రార్థనా భారం కలిగి ప్రార్థించారు. డేవిడ్ బ్రైనార్డ్ 29 సం॥లకే చనిపోయినప్పటికీ ఆయన చేసిన ప్రార్థనలు, ఉపవాస ప్రార్థనలు, తనకున్న మిషణరీ మైండ్ అనేకులను ప్రభావితం చేసి ప్రపంచంలో మిషనరీ ఉద్యమాన్ని తీసుకొచ్చింది. తన ప్రార్థనా జీవిత ఫలితంగా విలియంకేరీ, డేవిడ్ లివింగ్‌స్టన్, ఆండ్రూ ముర్రే, జిమ్ ఇలియట్‌లు మిషనరీలుగా అనేక దేశాలకు వెళ్ళి సువార్త వెలుగును అందించారు. రండి! ప్రార్థన చేద్దాం. ప్రభువు నామమెరుగని ప్రజలు ప్రభువును ఎరుగునట్లుగా.

**యుఇయస్ఐ సెల్ గ్రూప్స్** ప్రతి హాస్టల్లో, కాలేజీల్లో ఏర్పడి, ఆ కాలేజీ విద్యార్థుల కొరకు ప్రార్థన చేసేవారు. విద్యార్థి పరిచర్య ప్రారంభ దినాల్లో ప్రతి ఒక్కరం హాస్టల్ టెర్రస్‌పైకి వెళ్ళి ప్రార్థించేవారం. సెల్‌గ్రూప్స్‌గా ఏర్పడి ప్రార్థనలు చేసిన తర్వాత బైబిల్ స్టడీస్ ప్రారంభించేవారమని కీ.శే. దీనబంధుగారు చెప్పారు. విద్యార్థుల మధ్య జరుగుతున్న యుఇయస్ఐ ఉద్యమ రహస్యం ముమ్మాటికీ ప్రార్థనయే.

ఆత్మల కోసం ప్రార్థించడం అనేది రహస్య సేవ. దీనికి ప్రజాదరణ ఉండదు – యుఇయస్ఐ హ్యాండ్ బుక్

కాబట్టి – రండి, ప్రార్థన చేద్దాం. క్రీస్తునామమెరిగిన, ఎరుగని విద్యార్థుల కొరకు.

ప్రార్థన వ్యక్తులను, సమాజాన్ని, దేశాన్ని ప్రభావితం



చేస్తుందనుటకు ఉదాహరణగా కొన్ని సంఘటనలను మనం చూశాం. ఈ దృష్టాంతాల ద్వారా మనము బోధను పొంది (రోమా 15:4), బుద్ధి కలిగి (1 కొరిం 10:11) ప్రార్థన చేయడానికి ప్రోత్సహించబడతామని నమ్ముచున్నాను. మన ముందున్న ఈ మాదిరిని అనుసరిస్తే అద్భుతాలను చూడగలము.

**ప్రార్థన–క్రైస్తవులు** అనే అంశంపై ఒక క్రైస్తవ సంస్థ చేసిన సర్వే వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

65% క్రైస్తవులు ప్రార్థన తప్పనిసరిగా మార్పు తీసుకొస్తుంది అని భావించారు.

86% క్రైస్తవులు దేవుడు తప్పక ప్రార్థనను ఆలకించి జవాబు ఇస్తాడు అని భావించారు.

46% క్రైస్తవులు కష్టాల్లో ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే వాస్తవంగా ప్రార్థిస్తామని చెప్పారు.

ఒక క్రైస్తవుడు సగటున రోజుకి 5 నిమిషాలు వ్యక్తిగతంగా ప్రార్థిస్తాడని ఆ సర్వేలో తేలింది.

ఈ సర్వే ప్రకారం వాస్తవాన్ని గమనిస్తే మన ఆధ్యాత్మిక జీవిత అభివృద్ధి, ప్రభువు కొరకు విద్యార్థులను గెలుచుకోవడానికి ఐదు నిమిషాల ప్రార్థన సరిపోతుందా? ప్రశ్నించుకొందాం. ఒక క్రైస్తవ కౌన్సిలర్, '24 గంటలలో 23.5 గంటలు నీ కొరకు వాడుకొన్నప్పటికీ, ప్రారంభంలో కనీసం ఒక అర గంట ప్రార్థించడం మొదలు పెడితే, ఆత్మీయ జీవితంలో ఎదిగేకొద్ది ఎక్కువ సమయం ప్రార్థించగలవు' అని చెప్పారు. ఇది అనుభవపూర్వకమైన సలహా.

'ప్రార్థన, సుప్రార్థన నీ ప్రాభవంబు మరతునా' అని పాట పాడుకోవటమే కాదు, మరువక ప్రతిదినం ప్రభువు పాదాల చెంతచేరి ప్రార్థిద్దాం. తోటివారిని కలుపుకొని రండి ప్రార్థన చేద్దాం అని ప్రార్థించి ముందుకు సాగుదాం.

– **ఆర్. ప్రభుదాస్**, తెనాలి



# ప్రేయింగ్ హైడ్

జాన్ నెల్సన్ హైడ్ అమెరికా దేశంలోని "ఇల్లినాయిస్" రాష్ట్రంలోని కారల్‌టన్ అనే పట్టణంలో 1865 నవంబర్ 9న రెవరెండ్ స్మిత్ హారీస్ హైడ్, శ్రీమతి హైడ్ దంపతులకు జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు గొప్ప ప్రార్థనాపరులు. వారి గృహమును ఎల్లప్పుడూ ప్రార్థన ద్వారా ప్రభు సన్నిధితో నింపుకొనేవారు. చిన్ననాటి నుండి బిడ్డలను భక్తిలో, దేవునియందు క్రమశిక్షణలో పెంచారు. తల్లి ప్రార్థనా జీవితం, తండ్రి ప్రసంగాల వలన జాన్ హైడ్ ప్రభావితుడై ఏదో ఒక దేశానికి మిషనరీగా సేవ చేయాలని ఆశ పడేవాడు.

హైడ్ అతని సహోదరుడు ఎడ్మండ్ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. కాలేజ్ విద్యను, సెమినరీ విద్యను కలిసే చదివారు. ఎడ్మండ్ మోంటానా అనే దేశానికి మిషనరీగా వెళ్ళాలని ఎంతో ఆశించాడు కానీ అనారోగ్యంతో అకస్మాత్తుగా మరణించాడు. ఈ సంఘటన హైడ్ హృదయాన్ని ఎంతో కలిచి వేసింది.

ఒకరోజు రాత్రి 'విదేశీ సేవకుల సిద్ధపాటు' అనే కూడికకు హాజరైనప్పుడు 'హెన్రిక్ జాన్సన్' గారి ప్రసంగం హైడ్‌ను ప్రభావితం చేసింది. అప్పుడు సేవకు సమర్పించుకొని దేవునికి ప్రార్థించి నన్ను ఏ దేశానికి పంపినా నేను వెళ్ళడానికి సిద్ధమే అని తీర్మానించుకొన్నాడు. అలా సేవకు తనను తాను సిద్ధపరుచుకోవడం ప్రారంభించాడు. అతడు అందరి గురించి వ్యక్తిగతంగా ఎంతో సమయం ప్రార్థించేవాడు. అతని ఆత్మ ఎప్పుడూ జ్వాలవలె మండుతూ ఉండేది. ప్రార్థన ద్వారా గొప్ప పనులు చేయగలనని విశ్వసించేవాడు.

తరువాత కొంత కాలానికి 1892లో మిషనరీగా భారతదేశం వచ్చి పంజాబ్ ప్రాంతంలో సేవ ప్రారంభించాడు. ప్రారంభంలో ఆయన అనేక సమస్యలను, కష్టాల్ని ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా దేశభాషలు నేర్చుకోవడం ఆయనకు చాలా కష్టమైంది. ఎందుకంటే వినికిడి లోపం వల్ల ఎదుటి వారి మాటలు సరిగా వినలేకపోయేవాడు. అయినా సరే భాషలు నేర్చుకొని ఒంటరిగా బైబిల్ చదువుతూ వాక్య మర్మాలను గ్రహిస్తూ ఉండేవాడు. భాషా అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేస్తూ బైబిల్ అధ్యయనానికే సమయం కేటాయిసున్నాడని కమిటీ వారు ఆయన్ను మందలిస్తే 'మొదటి విషయాలు మొదట' అని సమాధానం ఇచ్చాడు.

ఈయన శారీరకంగా బలహీనుడిగా ఉండడం వల్ల, మెల్లగా మాట్లాడడం వల్ల ఈయనను ఎవ్వరూ కూడా మిషనరీగా భావించలేదు. ఎందుకంటే మాటలు తడుముకొనేవాడు, గట్టిగా కేకలు వేస్తూ మాట్లాడలేకపోవడం, ఉత్సాహంగా ఉండకుండా ప్రశాంతంగా సాధుగుణం కలిగి ఉండటం వల్ల ఈయనను మిషనరీగా పనికిరాడని అంటుండేవారు. కానీ జాన్ హైడ్‌లో చురుకుదనం, మాట నేర్పరితనం, శరీర దృఢత్వం లేకపోయినప్పటికీ ఆయనలో ఒక గొప్ప గుణం దాగి ఉంది. ఆ గుణము, ప్రత్యేకత ఏంటంటే "మోకాళ్ళ ప్రార్థన". మోకాళ్ళ మీద పడి గంటల తరబడి ప్రార్థన చేయడం. ఈయన ప్రార్థనా గదిలో ఎడతెగని ప్రార్థన, విజ్ఞాపనలు, ధారలుగా కారే కన్నీరు ఉండేవి. అన్నపానాలు మానివేసి ఆత్మల రక్షణ కోసం, పరిచర్య కొరకు ప్రభువు

సన్నిధిలో ప్రార్థిస్తూ, విలపిస్తూ తన హృదయాన్ని కుమ్మరించి దేవునితో గోజాడేవాడు. ప్రార్థనే తన జీవితంగా, ఊపిరిగా మార్చుకొన్నాడు. ఈయన మోకాళ్ళ దగ్గర ప్యాంటు చినిగిపోయి ఉండేది. అలా ప్రార్థనా వీరుడిగా నిలిచి పోయాడు.

ఇండియాకు వచ్చిన ప్రారంభ సంవత్సరాల్లో ఎవ్వరూ దేవునివైపు తిరగడం లేదని ప్రభువు సన్నిధిలో ఆవేదనతో విజ్ఞాపన చేశాడు. సంఘం బైబిల్ ప్రమాణాలకు చాలా విరుద్ధంగా ఉండేది. క్రీస్తు పట్ల సంపూర్ణ విధేయత లేదు. కొందరు తమ వ్యక్తిగత ఆనందాలకు అలవాటు పడితే, కొందరు శ్రమలకు భయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో ఉజ్జీవం రావాలని, పరిశుద్ధ జీవితం జీవించాలని బిగ్గరగా విలపిస్తూ ప్రార్థించేవాడు.

1904వ సం॥లో ఇండియాలోని విదేశీ మిషనరీస్ పంజాబ్ రాష్ట్రంలోని 'సియోల్ కోట్' (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) అనే స్థలంలో ఉజ్జీవ కూటాలు ఏర్పాటు చేసి హైడ్‌ను కూడా ప్రసంగీకుడిగా ఆహ్వానించారు. అయితే ఆ మీటింగ్‌లో ప్రసంగించడం కోసం, ప్రజలు దేవుని వాక్యం ద్వారా మార్పు చెందడం కోసం 21 రోజులు ప్రార్థన చేశాడు. అలా ప్రార్థన ద్వారా సిద్ధపడి వెళ్ళిన జాన్ హైడ్ ముఖంలో వెలుగును ప్రజలు చూశారు. ఆ మీటింగ్‌లో తన ప్రార్థనా అనుభవాన్ని, పాపాన్ని జయించి జయజీవితం జీవించడానికి యేసుప్రభువు ఎలా సహాయం చేస్తాడు అని కేవలం 15 నిమిషాలు మాత్రమే వివరించాడు. తర్వాత పరిశుద్ధాత్ముని కార్యం మొదలై ప్రజలు వారి పాపాలు ఒప్పుకొని పశ్చాత్తాపంతో ప్రభువు పాదాల చెంత కన్నీరు కార్చారు. ప్రసంగం 15 నిమిషాలలో ముగించినప్పటికీ ప్రార్థన మాత్రం కొన్ని గంటలు చేయగలిగారు. అంతటి లోతైన అనుభవంలోనికి, పశ్చాత్తాపంలోనికి ప్రజలను నడిపించగలిగాడు. అంతటి ఉజ్జీవం అంతకు ముందెన్నడూ చూడలేదని ప్రజలు సాక్ష్యమిచ్చారు. పెద్ద పెద్ద ప్రసంగాలు చేయలేకపోయినా తన ప్రార్థనా శక్తి ద్వారా కొద్ది నిమిషాలు ప్రసంగించినా ప్రజలను పశ్చాత్తాపంలోనికి నడిపించి అనేక ఆత్మలను రక్షించగలిగాడు. దేవుని సన్నిధిని ప్రజల మధ్యకు తెచ్చే ఏకైక మార్గం ప్రార్థనే అని గుర్తించాడు.

జాన్ హైడ్‌తో ఉన్నవారు "అయ్యా భోజనం చేయడానికి రండి అని పిలిచినప్పుడు "ఆకలి లేదు నన్ను ఇంకా కొంచెం సేపు ఆత్మల కొరకు అల మటించనివ్వండి." అని అనేవాడట. అలా ప్రార్థనలో పడి బలహీనుడైపోయినా మోకరించడానికి బలము చాలకపోయినా గదిలో కిందపడి, మీదపడి, దొర్లుతూ ప్రార్థనచేసి ప్రభువా రోజుకు ఒక ఆత్మనైనా నాకు అనుగ్రహించు అని అడుగుతుండేవాడు. ఆ ప్రార్థన వినిన ప్రభువు రోజుకు ఒకరిని రక్షించే భాగ్యం ఇచ్చాడు. ఆ తరువాత రోజుకు నాలుగైదు ఆత్మలనైనా ఇవ్వు అని ప్రార్థించినప్పుడు ఆ ప్రార్థన విని అనేక ఆత్మలను రక్షించు భాగ్యాన్ని దేవుడు అతనికి అనుగ్రహించాడు.

అతనిలోని పరిశుద్ధాత్మ నింపుదల అతనిని ఒక ప్రార్థనా యోధునిగా మార్చివేసింది. జాన్ హైడ్ రక్షకుని ప్రకటించే విషయంలో ఎన్నడూ అలసిపోలేదు. అతడు ప్రతి మీటింగ్‌కు వెళ్లేముందు "ప్రభువా నాకు ఆత్మలను దయచేయండి లేకుంటే నేను మరణిస్తాను" అని దేవుని దగ్గర ఎంతో మొఱ్ఱ పెట్టేవాడు. ఆ తర్వాత దినాలలో ఇండియా అంతటా పర్యటించి పరిచర్య చేశాడు. అప్పటికే అతనిని అందరూ "ప్రార్థనా పరుడైన హైడ్" అని పిలిచేవారు. కలకత్తా, ముంబాయి వంటి నగరాల కోసం అతడు ప్రత్యేకంగా విజ్ఞాపన ప్రార్థనలు చేశాడు. అతడు మోకాళ్ళ మీద ఉండి ప్రార్థిస్తుండగా ప్రజలు వణకుచు పశ్చాత్తాప పడేవారు. ప్రార్థనా వీరుడిగా ఎన్నో ఆత్మలను గెలిచాడు.

భారతదేశంలో 19 సంవత్సరాలు సేవ చేసిన ప్రార్థనాపరుడైన మిషనరీగా అనేక ఆత్మలను ప్రభువు కొరకు సంపాదించాడు. 1911వ సం॥లో హైడ్ ఇండియా నుండి అమెరికాకు ప్రయాణిస్తూ బ్రిటిష్ దీవులలో ఇండియా నుండి వచ్చిన మిషనరీలను కలుసుకున్నాడు. ఘూబరీ అనే ప్రాంతంలో అతడు ఎంతో భారంతో ప్రార్థిస్తుండగా అనారోగ్యానికి గురయ్యాడు. తర్వాత అమెరికా దేశానికి వెళ్ళగా అతని బ్రెయిన్‌లో ట్యూమర్ ఉన్నట్లు అక్కడి వైద్యులు కనుగొన్నారు. చివరికి పడకమీద ఉన్నప్పటికీ, లేవలేని స్థితిలో ఉండి విశ్రాంతికి బదులు విజ్ఞాపన చేస్తున్నాను అని ప్రార్థనలోనే తన జీవితాన్ని గడిపేవాడు. అలా తన 47వ సంవత్సరంలో పరిచర్య ముగించి 1912 ఫిబ్రవరి 17న ప్రభువు వద్దకు చేరుకున్నాడు.

– విజె డెస్క్



# కాగుతున్న కాగడా

ఉడుకు రక్తం ఉక్కు నరాలు
ఉప్పెనంత దుడుకుతనం
తెగించే దురుసుతనం
తరంగానికున్నంత పవరు
తురంగానికున్నంత పొగరు గల
స్టూడెంట్స్‌కు సువార్త చెప్పడం
కత్తి మీద కచేరి చేయడం లాంటిది...
అలాంటి విద్యార్థుల కొరకు
ఆనాడు ఇనాక్ గారికి కలిగిన ఆ దర్శనమే
ఈనాడు ఉవ్వెత్తున ఎగసిన
విద్యార్థి ఉద్యమానికి నిదర్శనం...

విప్లవాలు ఉద్యమాలు
భారతావనికి కొత్తకాదు
సవాళ్ళు సమస్యలు
ఉద్యమాలకి కొత్తకాదు
హిందూదేశపు వీధుల్లో
హింసా భారత సందుల్లో
ఒక ఉద్యమం మహోద్యమమై
అడ్డంకులు ఆటుపోట్లను దాటుకొని
ఏడు దశాబ్దాలుగా
దేశం నలు మూలలా
విద్యార్థి హృదయాలకు
అల్లుకుపోయిన అలుపెరుగని
ఆగని జ్వాలే యుఇయస్ఐ....

తరాలు మారుతున్నాయి
తీరులూ మారుతున్నాయి
వాసిలేని రాసులే పొర్లి పారుతున్నాయి
పరిమళం లేని పద్మాలే వికసిస్తున్నాయి
మాదిరి జీవితం మసకబారుతోందా?
మన్నించే నైజం వెనకపడిపోయిందా?
నడిపించని నడుంవంచని మంద కాపరులమా?
ప్రభావితం చేయలేని వెలుగు ప్రభాతాలమా?

దేశంలో చట్టాలు మారొచ్చు
లా లు ఎలాగైనా చేయొచ్చు
చట్టాలను మన చుట్టాలుగా మార్చిన
దానియేలు దేవుడు మనకు దేవుడు కాడా?
పడిపోయిన ప్రాకారాలను
ఒక చేత్తో కత్తితో మరో చేత్తో కర్తవ్యంతో పూర్తి
చేయించిన
నెహెమ్యా నాయకత్వం
మనకు స్ఫూర్తి కాదా?
చావు దెబ్బలు తిని
చెరసాల గోడల మధ్య
స్తుతులు పాడిన
పౌలు సీలల ప్రార్థన
మనకు మాదిరి కాదా ???

కళ్ళతో తప్ప కాళ్ళతో నడవని యువతరం
వేళ్ళతో తప్ప నోళ్లతో మాట్లాడని నవతరం
పాయసాలు కాదని నెట్ బ్యాలన్స్‌లు చాలని
టెక్స్ట్ బుక్ వద్దని ఫేస్ బుక్ ముద్దని
అంతర్జాలమే అంతా అనుకొని
తరించే తరం తరలి వచ్చింది
స్మార్ట్ ఫోన్ స్టూడెంట్స్‌కు సువార్త ఓ సవాలు!!!
విద్యార్థి ప్రపంచంపై ఉందా మరి మన చేవ్రాలు??

విద్యార్థి ఉద్యమం
వజ్రోత్సవం వైపు వడివడిగా
పరిగెడుతున్న వేళ
విద్యార్థి ఉద్యమ
ఉనికిని ఉగ్గబడుతూ
ఉద్యమ స్ఫూర్తిని
గుండెల నిండా నింపుకొని
ఉద్యమ ఆద్యులను స్మరించుకొంటూ
కాగుతున్న కాగడాను మండుతున్న దర్శనాన్ని
మరో తరానికి అందిద్దాం!!!

– **రమణ,** పామిడి



# రక్షణ

## పరిచయం

రక్షణ అనే పదం పాతనిబంధనలో 'యాష్‌హ' అనే హిబ్రూ మూల పదం నుండి వచ్చింది. దీని అర్థం శత్రువుల నుండి, లేక శ్రమ నుండి, రోగం నుండి విడుదల. యెషువా అనే పదానికి రక్షకుడు అని అర్థం. యెషువా అనే పదాన్నుండే యేసు అనే పదం వచ్చింది.

రక్షణ గ్రీకులో 'సోజో' అనే మూల పదం నుండి వచ్చింది. 'సోజో' అంటే రక్షించడం, విడిపించడం, తప్పించడం అనే అర్థాలు ఉన్నాయి. ఈ పదానికి స్వస్థత అనే మరో అర్థం కూడా ఉంది. సంక్షోభం నుండి విడుదల కోసం ఆశిస్తూ పండుగలలో హెల్లెనీ గ్రీకులు చేసే బలులను ఈ పదం సూచిస్తూ ఉంది.

సోజో అనే పదానికి పాపక్షమాపణకు మించిన అర్థం ఉంది. అంటే రోగాల నుంచి స్వస్థత, శత్రువు నుండి విడుదల. ఆత్మీయంగా సాతాను, వాని దూతల నుండి విడుదల. రక్షణను గూర్చి అధ్యయనం చేసే శాస్త్రాన్ని సోటిరియాలజీ అంటారు.

## రక్షణ సాధారణ అర్థం

అత్యంత ప్రమాదంలో ఉన్న వారికి రక్షణ లేక విడుదల మరణం నుండి తప్పించబడడం. మన ఆత్మ నరకం నుండి తప్పించబడడం. పాతనిబంధనలో సాంఘిక, ఆర్థిక, శారీరక పరిస్థితుల సందర్భంలో కూడా రక్షణ అనే పదం వాడబడింది. శత్రువుల నుండి విడిపించడానికి వారికొక రక్షకుడిని దయ చేసెను అని న్యాయాధిపతులను గూర్చి రాశాడు (న్యాయా 3:9,15; 2 రాజులు 13:5).

## మానవులకు రక్షణ అవసరమా?

అందరూ పాపము చేసి దేవుడు అనుగ్రహించే మహిమను పొందలేక పోవుచున్నారని దేవుని వాక్యం చెబుతుంది. నీతిమంతుడు ఒక్కడూ లేడు. అందరూ త్రోవతప్పి ఏకముగా పనికిమాలిన వారైరి అని వాక్యం చెబుతుంది. దేవుని ఎరుగని వారు బలహీనులు, భక్తిహీనులు, పాపులు, దేవునికి శత్రువులు అని వాక్యం చెబుతుంది. దుర్నీతిచేత సత్యాన్ని అడ్డగించే మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీద, దుర్నీతి మీద దేవుని కోపం పరలోకం నుండి బయలు పడుతుందని వాక్యం చెబుతుంది.

పాపం, దేవునికి మానవునికి ఉన్న సంబంధాన్ని తెంచి వేసింది. రక్షణ ఈ సంబంధాన్ని పునరుద్ధరిస్తుంది. పాపం పర్యావసానాలు చాలా దారుణంగా ఉన్నాయి. మానవుని స్వభావం పూర్తిగా కలుషితమై పోయింది. సత్యాన్ని అసత్యానికి మార్చడం స్వాభావిక ధర్మాన్ని విడిచిపెట్టి అస్వాభావిక ధర్మాన్ని అవలంభించడం, దేవుని మహిమను చతుష్పాద జంతువుల స్వరూపంలోకి మార్చడం, చిన్నపిల్లలు,

యౌవ్వనస్తులు, వృద్ధులైన స్త్రీలపైన సామూహిక లైంగిక దాడులు, హత్యలు, అవినీతి, అక్రమం, అన్యాయం, నరహత్యలు, లంచగొండితనం, పగలు, కక్షలు మొదలైనవన్నీ గమనిస్తే మానవుడు అధో:గతికి దిగజారిపోయాడని అర్థం అవుతుంది. దాని పర్యావసానం దేవుని ఉగ్రత, శిక్షావిధి, మరణం. పాపం వలన వచ్చే జీతం మరణమని బైబిల్ సెలవిస్తుంది. అది శరీర, ఆత్మీయ మరణం.

పాపం దేవునితో సంబంధమే కాకుండా మానవులతో మానవులకు గల సంబంధాలను కూడా పాడు చేసింది. మానవుడు స్వార్థంతో పర్యావరణాన్ని కాపాడకుండా నాశనం చేస్తున్నాడు. తత్ఫలితమే అకాల వర్షాలు, వరదలు, విపత్తులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, కరువులు.

## రక్షణ ఎలా వస్తుంది?

ఒక వ్యక్తి రక్షణ పొందాలంటే పరిశుద్ధాత్ముని కార్యం అతనిలో జరగాలి. వ్యక్తులు సువార్త విన్నప్పుడు పరిశుద్ధాత్ముడు, నీతిని గూర్చి, తీర్పును గూర్చి, పాపాన్ని గూర్చి ఒప్పింప చేయాలి. తండ్రి ఆకర్షిస్తేనే గానీ ఎవడు తన యొద్దకు రాడు అని వాక్యం సెలవిస్తుంది. దేవుడు ఎవరిని ముందు ఎరిగాడో వారిని పిలిచాడు, పిలిచిన వారిని నీతిమంతులనుగా చేసి, వారిని మహిమపరిచాడు అని వాక్యం చెబుతుంది. ఇవన్నీ దేవుడు చేసే కార్యాలైతే, మనం ఆయన సిలువ కార్యాన్ని విశ్వసించడం, పశ్చాత్తాపం చెందడం, పాపక్షమాపణ పొందడం మన వంతు. పరిశుద్ధాత్మ దేవుడు నూతన స్వభావం కలుగజేయడం ద్వారా దేవుడు మనలను రక్షిస్తాడని వాక్యం చెబుతుంది (తీతు 3:5). రక్షణ అనుభవంలో జరిగేది తిరిగి జన్మించే ప్రక్రియ. ఒక వ్యక్తి నూతన జన్మ అనుభవం పొందకుండా రక్షణ పొందలేడు.

మన సువార్త సభలలో వాక్యం ప్రకటించినప్పుడు వచ్చిన స్పందనలు యేసు రక్షకుడు అని అంగీకరించే




మానసిక అంగీకారాలా? లేక నూతన జన్మ అనుభవంతో కూడిన రక్షణ కార్యమా? అని మనం పరిశీలించుకోవాలి.

## రక్షణను గూర్చి నూతన నిబంధన బోధ

1. నమ్మి బాప్తీస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మని వారికి శిక్ష విధించబడును.
2. యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడాయనను మృతులలో నుండి లేపెనని నీవు నమ్మిన యెడల నీవు రక్షణ పొందుదువు.
3. ప్రభువు నామమున ప్రార్థన చేయువారందరూ రక్షణ పొందుదురు.
4. మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తీస్మం పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అనే వరాన్ని పొందుతారు.
5. మీరు విశ్వాసం ద్వారా కృపచేతనే రక్షించబడి ఉన్నారు. ఇది మీవలన కలిగినది కాదు. దేవుని వరమే.

పైవచనాలన్నీ గమనిస్తే విశ్వాసం, పశ్చాత్తాపం, మారుమనస్సు, పాపక్షమాపణ రక్షణకు దారి తీస్తాయనే విషయాలు మనకు సుస్పష్టం.

## రక్షకుడు - రక్షణ నిశ్చయత

యేసుక్రీస్తు సిలువ కార్యము వలన మనకు రక్షణ లభిస్తుంది. యేసుక్రీస్తు అంటే రక్షణ కొరకు అభిషేకించబడిన వాడు అని మనకు తెలుసు. కుమారుడా నీ పాపములు క్షమించబడి యున్నవని పక్షవాయువు గలవానితో చెప్పి, పాపములు క్షమించుటకు మనుష్య కుమారునికి అధికారం గలదని మీరు తెలుసుకొనవలెనని చెప్పడం, నీ విశ్వాసం నిన్ను రక్షించెను, సమాధానం గలదానివై పొమ్ము అని పాపాత్మురాలైన స్త్రీతో చెప్పడం, నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని సిలువమీద దొంగతో చెప్పడం యేసు రక్షించడం మాత్రమే కాదు, రక్షణ నిశ్చయత కూడా ఆయన ఇస్తాడనే విషయం తెలియజేస్తుంది.

## రక్షణను గూర్చి ఉన్న తప్పుడు అవగాహనలు

చాలామంది క్రైస్తవ కుటుంబంలో పుట్టాము కాబట్టి పుట్టుకతోనే క్రైస్తవులు అనే అవగాహన కలిగి ఉంటారు. కానీ క్రీస్తు వారి హృదయాలలో

ఉండదు. ఎప్పుడూ పాపాలను గూర్చి పశ్చాత్తాపపడి పాపక్షమాపణ, రక్షణ పొందిన అనుభవం వారికి ఉండదు. కొంతమంది పశ్చాత్తాపం, మారుమనస్సు, పాప క్షమాపణ పొందిన అనుభవం లేకుండా బాప్తీస్మమే రక్షణ అనుకొంటారు. మీరు రక్షణ పొందారా? అనే ప్రశ్నకు నేను ఇంకా బాప్తీస్మం తీసుకోలేదు అనే సమాధానం నేను కొంతమంది యౌవనస్తుల నుండి ఎదుర్కొన్నాను. బాప్తీస్మం అనేది రక్షణ పొందాను అనడానికి బహిరంగ సూచన మాత్రమే. సంఘంలో ప్రభురాత్రి భోజనం తీసుకోవడానికి సంఘ సభ్యత్వం అవసరమవుతుంది. రక్షణ పొందకుండా పెళ్ళికోసం బాప్తీస్మం తీసుకొని రక్షణ పొందాము అనే భ్రమలో కొంతమంది నామకార్థ క్రైస్తవులు ఉన్నారు.

## రక్షణను విమోచన అనే కోణంలో చూడడం

నరావతారియైన యేసుక్రీస్తు త్యాగపూరితమైన మరణం ద్వారా పాపం యొక్క శిక్ష నుండి, దాని శక్తి నుండి, అపరాధ భావన నుండి విడిపించబడడం.

విమోచన అంటే వెల ఇచ్చి విడిపించబడడం. విమోచన అనే పదం 'పార్థాహ్' అనే హెబ్రూ పదం నుండి వచ్చింది. దీని అర్థం విడిపించబడడం. మానవుడు పాపానికి దాసుడిగా, బంధీగా ఉన్నాడు. పాపం, దానివల్ల వచ్చే శాపానికి గురయ్యాడు.

విమోచన అనే పదం ఐగుప్తులోని ఇశ్రాయేలీయుల బానిసత్వ సందర్భం నుండి వచ్చింది. యూదులు ఐగుప్తులో బానిసలుగా ఉన్నప్పుడు దేవుడు వారిని గొర్రెపిల్ల రక్తం ద్వారబంధాలకు పూయడం ద్వారా విమోచించాడు. గొర్రెపిల్ల చనిపోతుంది. కుమారులు మరణ దూత నుండి రక్షించబడతారు. యేసును లోకపాపములు మోసికొనిపోయే దేవుని గొర్రెపిల్ల అని యోహాను అన్నాడు. ఇది ఆయన చేసిన విమోచన కార్యాన్ని తెలియజేస్తుంది. వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచించబడలేదు గానీ పవిత్రమైన నిర్దోషమైన గొర్రెపిల్ల రక్తము చేత విమోచించబడినారు అని వాక్యం తెలియజేస్తుంది.

## రక్షణలో ఏమి జరుగుతుంది?

మన పాపాలన్నీ క్షమించబడతాయి. దేవుడు మనలను నిర్దోషిగా ప్రకటిస్తాడు. దీనినే నీతిమంతులుగా తీర్చబడడం అంటారు. దేవుడు మన స్వపరీక్ష, సహకారంతో అనుదినం మనలను పవిత్రీకరిస్తాడు. దీనిని పవిత్రీకరణ అంటారు. అంతిమంగా దేవుడు మనలను పాపపు ఉనికి నుండి విడిపిస్తాడు. దీనిని మహిమపరచబడడం అంటారు. స్థూలంగా చెప్పాలంటే పాపపు శిక్ష నుండి, పాపపు శక్తి నుండి, పాపపు ఉనికి నుండి దేవుడు మనలను విమోచిస్తాడు.

## రక్షణ పొందిన తర్వాత మనలో వచ్చే మార్పు

మన స్వభావం, వైఖరి, విలువలలో మార్పు వస్తుంది. ఈ మార్పులు మన సంబంధాలు, చర్యలు, ప్రతిచర్యలలో మార్పుకు కారణమవుతాయి. దేవుని కోణంలో నుండి అన్ని విషయాలు చూడడం అలవాటు అవుతుంది. సహోదర ప్రేమ, సహవాసం పట్ల ఆసక్తి, ఆత్మీయ విషయాల పట్ల శ్రద్ధ పెరుగుతుంది.

## రక్షణ వల్ల వచ్చే ఆశీర్వాదాలు

నిత్యజీవితానికి వారసులుగా అవుతాం. దేవునితో కోల్పోయిన సంబంధం పునరుద్ధరించబడుతుంది. పరలోక సంబంధమైన ప్రతి ఆశీర్వాదానికి అర్హులం అవుతాం. దేవునితో సమాధానం ఏర్పడుతుంది.

రక్షణ అనేది దేవుని ఆత్మకు, మన ఆత్మకు ఏర్పడే సంబంధం కాబట్టి మనము ఆయనకు ఆత్మీయ కుమారులం అవుతాం. పరిశుద్ధాత్ముడు మనలోనికి వచ్చి మన హృదయంలో నివసిస్తాడు. ఆయన మనలను నడిపిస్తాడు, నింపుతాడు, నియంత్రిస్తాడు.

## రక్షణ పొందిన తర్వాత దేవుడు మన నుండి ఆశించేది ఏమిటి?

మనం ఆత్మీయంగా ఎదగాలని, ఆయనను మనం వెంబడించాలని, ఇతరులను శిష్యులుగా చేయాలని, ఆయన విమోచన ఉద్దేశాలను నెరవేర్చాలని దేవుడు కోరుకొంటాడు. పౌలును గూర్చి దేవుడు సాక్ష్యమిస్తూ, ఇతడు నా నామాన్ని భరించడానికి నేను ఏర్పరచుకొన్న సాధనమై ఉన్నాడని చెప్పాడు. పౌలు కూడా ఆకాశం నుండి కలిగిన ఆ దర్శనానికి అవిధేయుడను గాక, మారుమనస్సు పొంది దేవుని వైపు తిరగాలని ప్రకటించుచున్నానని చెప్పాడు. రక్షణ పొందిన మనం మరింతమంది రక్షణ పొందడానికి ప్రయాసపడదాం.

**– జి. జెర్మియా ప్రసాద్,** ఏపి–ఇజియఫ్ స్టాఫ్, నంద్యాల




# ప్రార్థన

## పరిస్థితులను మార్చి, ప్రభావం చూపేలా చేసింది

కృష్ణా జిల్లా, మచిలీపట్నం ఇజియఫ్ సీనియర్ గ్రాడ్యుయేట్ **డా. టి. జోసఫ్ గారి సతీమణి సిస్టర్. జయంతి గారికి** జిల్లా స్థాయిలో ఉత్తమ హెచ్‌యంగా అవార్డు లభించిన విషయం మనందరికీ విదితమే. ఈ సందర్భంగా విద్యార్థి జ్వాల వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ అవార్డు రావడానికి గల కారణాలను చెప్పమన్నప్పుడు వారు ప్రార్థనా పూర్వకంగా ఈ విషయాల్ని తెలియజేశారు. దేవుని మహిమార్థం, మనందరికి ప్రోత్సాహంగా ఉండాలని, ఇజియఫ్ గ్రాడ్యుయేట్స్‌గా మనం కూడా పని చేసే ప్రాంతాల్లో పట్టుదలతో ప్రార్థిస్తూ, ప్రయాసపడుతూ, ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థి జ్వాల ఈ విషయాలు తెలియజేస్తుంది.

*"ఒకని నడత యెహోవాకు ప్రీతికరమగునప్పుడు వాని శత్రువులను సహా వానికి మిత్రులుగా చేయును" - సామెతలు 16:7*

కృష్ణా జిల్లాలోని జెడ్‌పిహెచ్‌యస్ మోపిదేవి స్కూల్‌కు ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిన దగ్గర నుండి అక్కడి పరిస్థితుల గురించి ప్రార్థిస్తున్నప్పుడు దేవుడు నాతో ఈ వాక్యం మాట్లాడుతుండేవారు.

కానీ ఎంతో సందేహం, ఎన్నో భయాలు....

### స్కూల్లో పరిస్థితులు

స్కూల్లో 450 మంది స్టూడెంట్స్, 30 మంది టీచింగ్ స్టాఫ్ ఉండేవారు. ప్రధానోపాధ్యాయురాలిగా ఆ స్కూల్‌కి వెళ్ళిన తొలి రోజుల్లో స్కూల్ నిర్వహణ అస్తవ్యస్తంగా, అధ్వాన్నంగా ఉండేది. పరిశుభ్రత, క్రమశిక్షణ కనుచూపుమేరలో లేవు. ఉదయాన్నే స్కూల్‌కు వెళ్ళి క్లాస్ రూమ్స్‌లో, భోజనశాలలో చూసేసరికి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన ఆనవాళ్ళు ఎంతో భయానకంగా ఉండేవి. స్టాఫ్ రూమ్ ఎప్పుడూ నిండుగా కళకళలాడుతుండగా క్లాస్ రూమ్స్ మాత్రం మాస్టారు లేక పిల్లల యుద్ధాలతో మారుమోగుతుండేవి. పిల్లలు, పెద్దలు ఎవరు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని స్థితి.

పిల్లలకు చదువు సరిగా లేదు. కాపీలకు అలవాటు పడిన సంస్కృతి. హెచ్‌యంగా ప్రతిరోజు అసెంబ్లీలో క్లాస్ రూమ్‌లో కాపీలు ఉండవని, చదివితేనే పాస్ అవుతారని చెప్పే మాటలకి వ్యతిరేకంగా... 'ఏం ఫర్వాలేదు ఎప్పటిలాగే మీరు పాస్ అయిపోతారు నేనున్నాను కదరా అని ఎంకరేజ్ చేసే మాస్టారు ఒకరు'.

క్లాస్‌కి వెళ్ళమని చెప్పినందుకు ఒక మాస్టారు విలేకరిని తీసుకొచ్చి మాట్లాడించాడు.

ఇలా ఎన్నో సమస్యలు... ఏది ముందు పరిష్కరించాలి? ఎలా పరిష్కరించాలి? మొదటిగా పరిష్కారం చూపే ప్రభువు వద్దకే వెళ్ళాను.

### ప్రభువిచ్చిన పరిష్కారాలు

**క్రమశిక్షణ:** "ఉదయం స్కూల్‌కి వచ్చిన వాళ్ళు సాయంత్రం నాలుగు గంటలకి మాత్రమే బయటికి వెళ్ళాలి, అన్ని క్లాసులకి, అన్ని పీరియడ్స్‌కి అందరూ

టైమ్‌కి వెళ్ళాలి" అనే నోటీస్ పంపాను. అది చదివి అందరూ నవ్వుకున్నారు.

మార్పులు అందరికీ ఆమోదయోగ్యంగా లేవు. అలజడి, అసహనం, అసత్య ప్రచారాలు మొదల య్యాయి. నేను కంగారు పడలేదు, పట్టు వీడలేదు, ప్రభు పాదాలు వీడలేదు. క్రమక్రమంగా పరిస్థితులు మారాయి.

స్కూల్లో థర్డ్ బెల్ కొట్టాక బయట ఎవరూ కనిపించకపోవడం, కేవలం క్లాసుల్లో మాత్రమే స్టూడెంట్స్ ఉండడం ఈ పాఠశాలలో సాధించిన గొప్ప విజయం.

పిల్లల్లో మార్పు కోసం ప్రేయర్‌తో పాటుగా మోటివేషనల్ క్లాసెస్‌ని మన గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడించడం జరిగింది.

**విద్యార్థుల్లో పరివర్తన:** స్కూల్లో ఉండే గంజాయి బ్యాచ్‌ని ఐడెంటిఫై చేసి వారిని ఆ అలవాటు నుండి బయటకు తీసుకురావడానికి స్థానిక ఎస్సై, సీఐల సహకారంతో ఎంతో ప్రయాసపడాల్సి వచ్చింది. ఇదొక గొప్ప సవాలు. దీనిలో బయాలజీ మాస్టారు సహకారం మరువలేనిది.

మగ పిల్లల క్రాపులు వికారంగా, అసహ్యంగా ఉండేవి. వాటిని ఖచ్చితంగా మార్చాలని అనుకొని పిల్లలకు, పేరెంట్స్‌కు కౌన్సిలింగ్ ఇచ్చాము. అప్పటికీ మార్పురాని పిల్లలను బార్బర్ షాప్‌కు లైన్‌గా తీసుకువెళ్లి సొంత ఖర్చుతో నార్మల్ క్రాఫ్ చేయించడం ఒక విధంగా సాహసమే అయ్యింది. అయినా వెనుదిరగలేదు. తర్వాత రోజుల్లో స్కూల్ విజిట్‌కి వచ్చిన ఆఫీసర్స్ మా పిల్లల నార్మల్ క్రాఫ్‌లు చూసి ఎంతో ఆశ్చర్యపోయారు.

పిల్లల్లో అబద్ధాలు, దొంగతనాలు సాధారణంగా ఉండేవి. వాళ్ళు తోటి వారి బాధను చూసి వెకిలిగా నవ్వడం నాకు చాలా బాధ కలిగించింది. వాటి గురించి పిల్లలతో మాట్లాడుతూ ఉండగా ఆశ్చర్యరీతిగా వారిలో ఎంతో పరివర్తన వచ్చింది. దేవునికే మహిమ.

**స్కూల్లో సౌకర్యాల ఏర్పాట్లు:** ఓపెన్ డైనింగ్ హాల్‌కి నాలుగు ఐరన్ డోర్లు పెట్టించడం, ప్రతి క్లాస్ రూమ్‌లో టేబుల్, ఛైర్ ఏర్పాటు చేయడం, బ్రేక్ సమయంలో పిల్లలు బయటకు వెళ్ళకుండా గేట్స్ పెట్టించడం లాంటి అనివార్యమైన విషయాలకు మూడు లక్షల వరకు ఖర్చయినా తప్పని పరిస్థితి.

స్కూల్లో ఆర్వో సిస్టం చెడిపోయింది. ఇక అది బాగుపడదని మెకానిక్ చెప్పాడు. పిల్లలకు డ్రింకింగ్ వాటర్ లేదు. రోజూ మినరల్ వాటర్ వ్యాన్ వచ్చి 24 క్యాన్లు నింపి వెళ్తుంది. నెలకు రూ. 2,500 నుంచి 3 వేల వరకు ఖర్చు నాదే. అయినా వెనుకాడలేదు.

దాతల సహకారంతో రూ. 1,50,000/- ఖర్చుతో 20 సీసీ కెమెరాలను పాఠశాలలో ఏర్పాటు చేయించాము. పల్లెటూరు కావడం వల్ల తరచూ విద్యుత్ సమస్యలు ఎదురవుతూ ఉండేవి. అందువల్ల రూ. 1,60,000/-తో సోలార్ ఎక్విప్మెంట్ అరేంజ్ చేయించడం వెనుక దేవుని సహాయం నేను స్పష్టంగా గమనించాను. దాతలు "మేడమ్, మీరు ఈ స్కూల్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు, మీరు వచ్చిన తర్వాత ఈ స్కూల్లో ఎన్నో మార్పులు వచ్చాయి, మా వంతు సహాయం అని వారు ముందుకు రావడం నాకు సంతోషాన్ని కలుగజేసింది.

**అకడమిక్ ఫలితాలు:** కాపీల సంస్కృతికి వ్యతిరేకంగా మా డీఈవో మేడం కూడా ఉండడాన్ని బట్టి అవి జరగకుండా చేయడానికి నాకు ఎంతో బలం వచ్చింది.

మొదటి సంవత్సరం కాపీలు లేవు. రిజల్ట్ 30%, రెండు ట్రిబుల్ ఐటీ సీట్స్ వచ్చాయి.

రెండవ సంవత్సరం కాపీలు లేవు. రిజల్ట్ 70%, రెండు ట్రిపుల్ ఐటీ సీట్స్ వచ్చాయి. డివిజన్లో థర్డ్, మండలంలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ప్లేస్‌లు సాధించాం.

మూడవ సంవత్సరం కాపీలు లేవు. రిజల్ట్ 91%, రెండు ట్రిబుల్ ఐటీ సీట్స్, మండలంలో సెకండ్ స్థానం సాధించాం.

2022-23 సంవత్సరంలో హైస్కూల్ ప్లస్‌గా మార్పు చెంది యంపీసీ, బైపీసీ గ్రూప్‌లు నిర్వహించాము. మా డివిజన్లో అందరూ ఒక గ్రూప్‌తో సరిపెట్టుకుంటే మేము రెండు గ్రూపులతో ఎదురీదాం. గవర్నమెంట్ వారు ఫస్ట్ ఇయర్ టీచింగ్ స్టాఫ్‌ని ఇవ్వలేదు. కొన్ని సబ్జెక్ట్స్‌ని ఉన్న స్టాఫ్‌తో చెప్పించగా, కెమిస్ట్రీకి మాత్రం ఒక రిటైర్డ్

లెక్చరర్‌ని మచిలీపట్నం నుంచి ప్రతిరోజూ కారులో తీసుకొచ్చి సిలబస్ పూర్తి చేయించాము.

ప్రతి రోజు సాయంత్రం 5:30 గం॥ల వరకు పిల్లలకు స్పెషల్ క్లాస్‌లు కండక్ట్ చేయడం వల్ల ఊహించని ఫలితాలు వచ్చాయి. 1000 మార్కులకి 933 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించింది మా విద్యార్థిని. ఈ రిజల్ట్ వల్ల ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ అందరూ మా వైపు చూశారు.

**మిడ్ డే మీల్స్:** మిడ్ డే మీల్స్ విషయంలో రాజీ లేని ధోరణి వలన 99% విద్యార్థులు భోజనం పాఠశాలలోనే చేస్తారు.

**పిల్లలతో నేచురల్ ఫామింగ్:** పల్లెటూరి పిల్లలే అయినా ఏ చెట్టుకు ఏ కాయలు కాస్తాయి, ఏ మొక్కలకు ఏ పువ్వులు పూస్తాయి, అనే చిన్న విషయాలు కూడా తెలియని పరిస్థితి వారిది. వారికి ప్రకృతితో పరిచయం ఉండాలని, వానపాములు మట్టికి, మనిషికి ఎంత మేలు చేస్తాయో వారు తెలుసుకోవాలనే ఆలోచనతో స్కూల్లో నేచురల్ ఫామింగ్ ప్రారంభించాము. రసాయనిక ఎరువులు అస్సలు వాడకుండా కేవలం నేచురల్ ఫామింగ్ ద్వారా ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల మొక్కలతో సాగు మొదలైంది. దాని కొరకు పలుగు, పార, వాటర్ ట్యూబ్స్, విత్తనాలు, మొక్కలు వంటి అదనపు ఖర్చు, అదనపు శ్రమ అయినా ఎంతో ఇష్టంగా ఈ పని జరిగింది. దేవుడు ఈ నేచురల్ ఫామింగ్‌ని ఆశీర్వదించగా మంచి ఫలితాల్ని చూశాము.

నాచురల్ ఫామింగ్‌లో చేసిన శ్రమ, కృషి కలెక్టర్ శ్రీ డీకే బాలాజీ గారిని ఆకర్షించి నన్ను సన్మానించేటట్లు చేసింది.

**కో కరిక్యులర్ యాక్టివిటీస్:** జిల్లాస్థాయి నేషనల్ ఫెస్టివల్స్‌లో మోపిదేవి స్కూల్ కల్చరల్ యాక్టివిటీస్ తప్పని సరిగా ఉంటాయి. వాటిలో మా పిల్లలు పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపించేవారు.

ఎస్సే రైటింగ్, డిబేట్ వంటి కాంపిటీషన్స్‌లో జిల్లాస్థాయి అవార్డ్స్ మా పాఠశాల చిన్నారులు సాధిస్తూ ఉండడం అతిసాధారణమైన విషయం. జిల్లా స్థాయిలో ఈఎండిపీలో అవార్డు రావడం, అటల్ ల్యాబ్ ద్వారా ఇన్నోవేటివ్ వర్క్స్ పిల్లలు చేయడం, ఇన్స్పైర్‌కు పిల్లలు సెలెక్ట్ కావడం, ఎన్.ఎం.ఎం.ఎస్‌లో ప్రతి సంవత్సరం సీట్లు సంపాదించడం వంటివి అదనం.

**అడ్మిషన్స్:** రాష్ట్రమంతటా అడ్మిషన్స్ తిరోగమనంలో ఉన్న రోజుల్లో ఈ సంవత్సరం మా పాఠశాలలో 163 మంది న్యూ అడ్మిషన్స్ వచ్చాయి. అది క్రిందటి సంవత్సరం కన్నా 42 మంది ఎక్కువగా ఉండడం మా డీఈవో మేడంని ఆకర్షించి, మా సామర్థ్యాన్ని గుర్తించేలా చేసింది.

**అవార్డు:** ఒకసారి డిఇవో మేడం స్కూల్ విజిట్‌కి వచ్చి ఒకదాని తర్వాత ఒకటి అన్నిటినీ చెక్ చేస్తూ "మీరు అన్నీ చాలా చక్కగా చేస్తున్నారు బెస్ట్ హెచ్‌యం అవార్డుకు ఎందుకు అప్లై చేయలేదు" అని అడిగారు.

"మేడమ్, నాకు నేనుగా బెస్ట్ హెచ్‌యం అని ఎలా చెప్పుకోను, అందుకే నేను అప్లై చేయలేదని చెప్పాను. తర్వాత మేడం చొరవ తీసుకొని ప్రత్యేకంగా రికమెండ్ చేయడం ద్వారా నేను అప్లై చేసుకోకుండానే ఈ అవార్డు నాకు లభించింది."



2024 సెప్టెంబర్ 5వ తేదీన టీచర్స్ డే సందర్భంగా ప్రభుత్వం వారు నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ బాలాజీ గారు, యంయల్‌సి శ్రీ లక్ష్మణరావు గారు అందచేశారు.

## ముగింపు

ఈ విజయాలన్నిటి వెనక ఉన్న సీక్రెట్ ఒకటి ప్రార్థన, రెండు ప్రార్థన, మూడు ప్రార్థన. అంతేకాకుండా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం వల్ల నేను నా వృత్తిలో రాణించడం, ఈ అవార్డు సాధించడం జరిగింది.

*"మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానం యొక్క సువాసనను కనపరుచుచు ఆయన యందు మమ్మును ఎల్లప్పుడూ విజయోత్సవంతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రం" – 2 కొరింథీ 2:14*

బైబిల్ స్టడీ

# కీలక వ్యూహం

## (నెహెమ్యా 1,2: 1-5)

### నేపథ్యం

దేవునికి నాయకునికి మధ్య కమ్యూనికేషన్ అయిన ప్రార్థనే నాయకత్వానికి ఊపిరి లాంటిది. నడిపించే గ్రూపుకు మిషన్ కమ్యూనికేట్ చేయడానికి ముందు నాయకుడు దేవునితో కమ్యూనికేట్ అయ్యి ఆయన ప్రణాళికలు తెలుసుకోవాలి"

పడిపోయిన పట్టణ గోడల, ప్రజల అవమానకర పరిస్థితిని గూర్చి సమాచారం తెలుసుకున్నప్పుడు నెహెమ్యా ఉపయోగించిన అన్ని కీలక వ్యూహాలలో మొదటిది, ప్రధానమైనది ప్రార్థన. ఈ విషయాన్ని గూర్చి నేర్చుకుందాం.

### ప్రశ్నలు

1. నెహెమ్యా ఎవరు? అతని విచారణ దేని గూర్చి? నెహెమ్యా గురించి మనం ఏమి నేర్చుకుంటాం?
2. తన స్నేహితుల నుండి వచ్చిన సమాచారానికి నెహెమ్యా తక్షణ స్పందన ఏమిటి? అతను తన విచారాన్ని ఎలా చూపించాడు?
3. విచారము నుంచి దేవునికి విజ్ఞాపన చేయటానికి ఎంత శ్రద్ధగా పూనుకున్నాడు? ఏమి నేర్చుకొంటాము?
4. తన గురించి, దేవుని గురించిన అభిప్రాయాలు నెహెమ్యా చేసిన ప్రార్థన నుండి ఏమి గ్రహిస్తాము? మనమూ అనుకరిద్దామా?
5. నెహెమ్యా ఎవరి పాపాలను ఒప్పుకున్నాడు? అతను ఎలా ఒప్పుకుంటున్నాడు? తన ప్రజల పక్షముగా చేసే విజ్ఞాపన ప్రార్థనను గూర్చి మనం నేర్చుకునే పాఠాలేవి?
6. నెహెమ్యాను నాయకత్వాన్ని చేపట్టటానికి "ప్రార్థన" ఎలా సిద్ధం చేసిందని మీరను కుంటున్నారు. చర్చించండి ?
7. నెహెమ్యా రాజు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పేముందు చేసిన క్విక్, షార్ట్, సూటియైన



ప్రార్థన అతను చేసిన నాలుగు నెలల ప్రార్థనతో ఎలా సంబంధం కలిగివుంది?
8. నెహెమ్యా దేవుని పనిని అర్థం చేసుకొని, పనికి పూనుకొనుకొని, పని ప్రారంభించటానికి 52 రోజుల్లో పూర్తిచేయటానికి తన ప్రార్థనా జీవితం ఎలా ప్రభావితం చేసిందో గమనిద్దాం? దీనిని మనం అలవరచుకొందామా?
9. ఎంతోమంది విద్యార్థుల జీవితాలు పాడై పోతున్నాయి, సంఘాలు పాడైపోతున్నాయి. నీ స్పందన ఏమిటి?
10. విద్యార్థుల జీవితాల్లో మార్పురావటానికి నెహెమ్యావలె ఎప్పుడైనా విజ్ఞాపన చేశావా?

నెహెమ్యా గ్రంథమంతటిలో చేసిన పన్నెండు ప్రార్థనలు ప్రస్తావించబడ్డాయి. కొన్ని రోజులు తరబడి, ఉపవాసముతో ఏడ్చిచేసిన "సూర్యోదయ దీర్ఘ ప్రార్థనలు"(1: 5-11). కొన్ని అతి చిన్న ప్రార్థనలు అత్యవసర సమయంలో చేసినవి (2:4, 6: 9). పాడైన జీవితాలను సువార్తతో కట్టే పనిని చేపట్టటానికి దేవుని సహాయం కోరుకోవాలి. దేవుని బలముతో పని పూర్తిచేయటానికి యెడతెగక, మెలకువగా ఉండి ప్రార్థన చేయడం అలవరుచుకొందాం.

– విజె డెస్క్



# సాతాను తంత్రాలు

సాతాను ప్రతివిధమైన తంత్రాలను ఉపయోగించి విశ్వాసుల్ని అప్రతిష్టపాలు చేస్తాడు. కృంగదీసి, నిరాశపరిచి ఓడిపోయేలా చేస్తాడు (ఎఫెసీ 6:11). మన పోరాటంలో సాతాను మోసపరచకుండా (2 కొరింథీ 2:11), అపవాది ఉరిలో పడిపోకుండా (2 తిమో 3:7), సర్పము తన యుక్తిచేత హవ్వను మోసపరిచినట్లు మనం మోసపోకుండా జాగ్రత్త పడాలి. మన మనస్సుల్ని చెరిపి క్రీస్తు యేసునందున్న సరళత, పవిత్రత నుంచి ఎలాగైనా తొలగించాలని దుష్టుడు ప్రయత్నిస్తుంటాడు (2 కొరింథీ 11:3). బైబిల్లో సాతానుకు ఇవ్వబడిన పేర్లు - దుష్టుడు, అపవాది, అబద్ధికుడు, నరహంతకుడు, నాశనంచేయువాడు, దొంగ, వెలుగుదూత. ఇవన్నీ వాడిస్వభావాన్ని తెలియజేస్తాయి.

## సాతాను తంత్రాలు

**సోమరులుగా చేయడం:** సాతాను విశ్వాసులను సోమరులుగా, నిష్ఫలులుగా చేస్తుంది. మనల్ని చెడు తలంపులతో శోధిస్తూ, ఏపనీ సంపూర్ణంగా చేయనీయకుండా మాంద్యులుగా చేస్తుంది. శరీరము అలసిపోయేటట్లు చేసి, దేవుని పనిలో ఆసక్తి లేకుండా చేస్తుంది.

**నిద్రలేమి:** చాలినంత నిద్రలేకపోవడం, నిద్రపట్టక పోవడం వలన మన ఇంద్రియాలు సరిగా పనిచేయక, శరీరం బలహీనపడి అస్వస్థతకు గురవుతాము. మనస్సును అనవసరమైన, అపవిత్రమైన, లోకసంబంధమైన ఆలోచనలతో నింపి నిద్రాభంగం కల్పిస్తాడు. ఆసక్తిని రేపే సెల్‌ఫోన్స్ వినియోగం సాతాను ప్రధానమైన తంత్రంగా ఉంది. ఈ సెల్స్‌లో యూట్యూబ్, వాట్సప్ వంటివి రాత్రిపూట వాడడం వలన ఆ రేడియేషన్ నిద్రలేమికి దారితీస్తుంది. దీనివలన పెందలకడనే లేవలేక, అనాసక్తితో, విశ్వాసి మౌనధ్యాన సమయం దెబ్బతింటుంది.

**పని భారం:** ఈ రోజుల్లో ఉద్యోగంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండడం వలన, దీనిని ఆసరాగా తీసుకుని అపవాది విసుగు, త్వరగా కోపపడడం, చిర్రుబుర్రులాడడం ద్వారా పాపం చేయడానికి ప్రేరేపిస్తాడు. సేవలో ఉన్న ఒత్తిడి ద్వారా కూడా దేవునితో మనకున్న సహవాసానికి ఆటంకం కలుగజేస్తాడు.

**బలహీనత:** సాతాను మన శరీరాన్ని ముట్టడానికి ప్రయత్నిస్తాడు. అనారోగ్యానికి, నరాల బలహీనతకు



గురి చేస్తాడు. ఏ పని చేయాలన్నా ఈ బలహీనత మనల్ని వెనక్కులాగుతుంది.

**మనస్సును వికలం చేయడము:** సాతాను అవిశ్వాసుల మనోనేత్రాలకు గ్రుడ్డితనం కలుగజేసి (2 కొరింథీ 4:4) యేసు ప్రభువును విశ్వసించకుండా చేస్తాడు. అంతేకాకుండా, విశ్వాసుల మనస్సులను నియంత్రించడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తాడు. సాతాను చెడుతలంపుల ద్వారా, క్షమించలేని గుణం ద్వారా, ద్వేషం, మత్సరం, అసూయ, నిరాశల ద్వారా మన మనస్సులోనికి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ తలంపులు వచ్చిన వెంటనే వాటిని వాక్యధ్యానంద్వారా, ప్రార్థనద్వారా అడ్డుకోవాలి. ఏవి పరిశుద్ధమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిపై మనస్సు నిలపాలి. (ఫిలి 4:8)

**అకాల మరణం:** సాతాను నరహంతకుడు (యోహా 8:44). వాడు, ప్రమాదాల ద్వారా మనకు హానిచేయ ప్రయత్నిస్తాడు. జీవం మరణం దేవుని ఆధీనం. అయినా కొన్నిసార్లు శ్రమలు కలుగజేయడానికి దేవుడు సాతానుకు అనుమతిస్తాడు (యోబు 1:12,15,19). కాబట్టి మన ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఆత్మ హత్య:** సాతాను ప్రభువుని శిఖరంపై నుంచి దూకమని ప్రేరేపించాడు (మత్త 4:6). ఆత్మహత్యలకు ప్రేరణ కలిగించేది, నిరాశ, డిప్రెషన్‌లకు లోను చేసేది సాతానే. నీళ్ళలో, నిప్పులలో దూకమని ప్రోత్సహించేది అపవిత్రాత్మలే (మార్కు 9:22).

**భావోద్రేకాలు:** సంతోషం, బాధ, భయం, క్రోధం, అసహ్యం, నమ్మకం, అంగీకారం, ఆశ్చర్యం, అసూయ, సిగ్గువంటి భావోద్రేకాలు మన జీవితంలో సాధారణంగా ఉంటాయి. వీటిని ఆసరాగా తీసుకుని శోధనకు గురై తప్పు చేసే విధంగా మనం అపవాదికి అవకాశం ఇవ్వకూడదు. ప్రభువు సహాయంతో వీటిని గమనిస్తూ విజయం సాధించాలి. వీటివలన అనేకమందిలో సంబంధాలు తెగిపోయే ప్రమాదముంటుంది. సాతాను ఎప్పుడూ సహవాసంలో ఐక్యతను పాడుచేయ ప్రయత్నిస్తుంటాడు.

**అనవసర ఖర్చు:** చాలా సందర్భాల్లో అతిగా డబ్బు ఖర్చుచేసే అలవాటు సాతానుకు బలమైన ఆయుధం అవుతుంది. ప్రణాళిక లేని ఖర్చులవల్ల అప్పులపాలై, ఆర్థికపరమైన ఇబ్బందులు కలుగుతాయి. ఇవి అనేక అవమానాలకు దారి తీస్తాయి. కాబట్టి దేవుని చిత్తానుసారంగా, ప్రార్థనా పూర్వకంగా ప్రాధాన్యతలను పాటిస్తూ ఖర్చుచేయాలి.

**ఫ్యాషన్ అభిరుచి:** దేవుని వాక్యంలో స్త్రీలు తగుమాత్రపు వస్త్రములతో అలంకరించుకోవాలి అని చెప్పబడింది (1తిమో 2:9). ఇతరులను ఆకర్షించి, రెచ్చగొట్టేవిధంగా అలంకరించుకొనేటట్లు సాతాను ప్రేరేపిస్తాడు. స్త్రీ, పురుషులు ఎవరైనా ఇతరులకు అభ్యంతరంగా, దేవునికి అవమానకరమైన రీతిలో ఫ్యాషన్స్‌కు పోరాదు.

**నాలుకను దుర్వినియోగము చేయడం:** అసభ్యకరంగా మాట్లాడే వారిని సాతాను సులభంగా ఉరిలో పడవేస్తాడు. సంబంధాలను పాడుచేస్తాడు. అందుకనే మన సంభాషణ ఉప్పువేసినట్లు కృపాసహితంగా ఉండాలి.

**నడిపింపులో అయోమయం సృష్టించడం:** దేవుని సేవ అయినా దైవచిత్తం ప్రకారం జరగాలి. కొన్నిసార్లు ప్రాధాన్యతలను పాటించడంలో సాతాను అయోమయంలో పడేసి, దేవుని చిత్తం నుంచి ప్రక్కకు నడిపిస్తాడు.

ఇటీవల సాహిత్య పరిచర్యకు పిలువబడిన ఒక మిషనరీ తన అనుభవాన్ని పంచుకున్నాడు. తనకు ఒక అనాథాశ్రమం ప్రారంభించాలనే కోరిక కలిగి, ఇది కూడా దేవుని సేవే కదా అని మొదలుపెట్టాడు. కానీ ఆ పరిచర్య చేస్తున్నప్పుడు తన హృదయంలో శాంతి లేదు. తాను సాతాను చేత మోసగించబడినట్లు తర్వాత గుర్తించాడు.

**పగటి కలలు:** తనలో తాను ఊహించుకోవడము. ఫీలింగ్స్‌తో కొంతమంది విశ్వాసులు పగటి కలలతో

కాలం గడుపుతుంటారు. సాతాను దేవునికి వ్యతిరేకమైన ఆలోచనలు, ఊహలు కలుగజేస్తాడు. ఆ ఆలోచనలోనే కొన్ని విగ్రహాలను ధనాపేక్ష, దురాశ, మోహపు చూపులు మొదలగు వాటిని సృష్టించి ఆ ఆలోచనలలోనే మనం జీవించే వారిగా మార్చి వేస్తాడు.

**విమర్శనాత్మక దృష్టి:** కొందరు జరిగిన ప్రతి సంఘటనను, ఇతరులు పలికిన ప్రతి మాటను విమర్శిస్తుంటారు. మిర్యాము మోషేకు వ్యతిరేకంగా మాట్లాడడం (సంఖ్య 12:1-10), మరియ ప్రభువును అత్తరుతో అభిషేకించినప్పుడు పలికిన విమర్శలు వాక్యములో చూశాము. ఇలాంటి విమర్శలు సహవాసాన్ని, సంబంధాల్ని పాడుచేసి దేవునితో సమాధానం కోల్పోయేటట్లు చేస్తాయి.

**వృద్ధాప్యం:** ఒంటరితనం, నిరాశ, నిస్పృహలతో ఈ వయస్సులో నీవు దేవునికి పనికిరావు, ఎవ్వరికీ పెద్దగా ఉపయోగ పడలేవు, ఇక దేవుని సేవచేయడం వృథా అనే భావనలతో సాతాను నిరుత్సాహ పరుస్తాడు. ఏ వయస్సు వారినైనా ప్రభువు వాడుకోగలడని గుర్తుంచుకోవాలి.

**కుటుంబాలను విచ్ఛిన్నం చేయడం:** ఇది సాతాను దుష్టక్రియ. మొదటి కుటుంబమైన ఆదాము, హవ్వల ను శోధించి పాపం చేసేటట్లు చేశాడు. భార్య, భర్తల మధ్య అనుమానాలు, అపోహలు, అపార్థాలు కలిగించి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాడు. దేవుని చిత్తంలో కాకుండా వివాహం చేసుకొంటే శత్రువుకు ఎక్కువ అవకాశం ఇచ్చినట్లే. కులము, కట్నం, లోకాచారాలు అనుసరించేవారు ఈ ఉరిలో పడతారు. భార్యభర్తలను నైతికంగా పడగొట్టాలని, వారు చేసే సేవను ఆటంకపరచాలని నిత్యం అపవాది ప్రయత్నిస్తుంటాడు. భార్య, భర్తలు ఇంటిని, పిల్లలను శ్రద్ధగా చూసుకోకుండా బయట బిజీగా గడిపేటట్లు, కుటుంబ ఆరాధన నిర్లక్ష్యం చేసేటట్లు చేసి దుష్టుడు కుటుంబాల్ని విచ్ఛిన్నం చేస్తాడు.

**గర్వం:** సాతాను గురి మన చిత్తాన్ని లోబరచుకోవడం. సాతాను ఆయుధం గర్వం. (సామె16:18). వాడి ఉద్దేశం విశ్వాసిని దేవుని చిత్తం నుండి తొలగించడం. విశ్వాసులు తమ అనుభవాలను బట్టి, హోదాను బట్టి, పరిచర్యలో బాగా వాడబడడం, తలాంతులు కలిగి ఉండడం,తమ ఆస్తులు, నాయకత్వాన్ని బట్టి గర్విస్తూ ఉంటారు. ఇవి చాలు సాతాను ప్రవేశించడానికి. యెషయా 14:12-14లో సాతాను 5 విధానాలు గా తన్నుతాను హెచ్చించుకొన్నాడు. చివరకు నరకంలో ఒక మూలకు త్రోయబడ్డాడు (15వ). అందువల్ల దీనమనస్సు అనే వస్త్రాన్ని ఎల్లప్పుడూ ధరించుకోవాలి (1పేతు 5:5). దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. గర్వపు చూపులు, గర్వపు మాటలు, గర్వపు మనస్సును సిలువ వేయాలి. మనం సంపూర్ణంగా పరిశుద్ధాత్మకు అప్పగించుకొన్నట్లయితే విజయం మనదే (ఫిలి 2:13).

**నిందలు వేయడం (ప్రక12:10):** సాతాను వాడే మరొక ఆయుధం నిందలు వేయడం. తద్వారా మన హృదయాన్ని, మనస్సాక్షిని గాయపరచడం. అపరాధ భావన కల్గించి రక్షణానందాన్ని దొంగిలించడానికి ప్రయత్నిస్తాడు. ఇలాంటి సమయంలో నిరంతరం మన కోసం విజ్ఞాపనచేసే మన ప్రభువుకు ప్రార్థన చేయాలి. దేవుని వాగ్దానం విశ్వాసంతో స్వతంత్రించుకోవాలి (యెషయా 51:7). “మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి, వారి దూషణ మాటలకు దిగులు పడకుడి.” మనము దిగులు పడకూడదు. మనము దేవుని చేత ఏర్పరచబడిన వ్యక్తులం. దేవునికి అప్పగించుకోవాలి. తన బిడ్డలను ఎలా కాపాడుకోవాలో ఆయనకు తెలుసు.

ఇవే కాకుండా అనేకమైనవి ఉన్నాయి. భౌతిక సంబంధమైన వాటిపై అత్యాశ, సమర్పణ జీవితం పట్ల అలక్ష్యం, ఐహిక విచారములు, దురాశతో రాజీపడే జీవితం, శరీరాశతో ఆర్థిక ఇబ్బందులు, దేవుని కంటే సుఖానుభవాన్ని ప్రేమించడం, కుటుంబ సంబంధాలలో విచ్ఛిన్నం, ప్రాధాన్యతలు పాటించకపోవడం, కులతత్వం, ప్రాంతీయతత్వం, ప్రభువుకంటే సేవను అతిగా ప్రేమించడము, వర్గాలను ప్రోత్సహించడము, ఆధిపత్యం కోరుకోవడము, ప్రభుకోసం జీవించడం కంటే పనిచేయడానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వడం, నాణ్యత కరువైన కార్యక్రమాలు, క్షమించలేని గుణము మొదలైనవి.

## సాతాను ఎప్పుడు దాడి చేస్తాడు?

ప్రార్థన చేయాలని అనుకుంటున్నప్పుడు, ప్రారంభించడానికి ముందే మన తలంపులపై దాడి చేస్తాడు. కొన్నిసార్లు ప్రార్థన చేయాలనే భావనే రానియ్యడు.

పాపంలో పడినప్పుడు, మరణ సమయంలో దాడి చేస్తాడు. మన పరాజయాలను, పాత పాప విషయాలను జ్ఞాపకం చేసి నిరాశపరుస్తాడు. అప్పుడు మనం సమయోచితమైన సహాయం కొరకు కృప పొందేటట్లు ధైర్యంతో క్రీస్తు దగ్గరికి రావాలి, ఆయన దగ్గరకు వచ్చి మన ప్రతి పాపాన్ని ఆయన దగ్గర ఒప్పుకోవాలి. (హెబ్రీ 4:14,16; 1యోహా 1:9; యోహా 5:24; రోమా 8:38,39).

## సాతాను తంత్రాలను ఎదుర్కోవడం ఎలా?

మనము శత్రువులను, పొంచి ఉన్న దుష్టశక్తుల శ్రేణిని ఎదుర్కోవడానికి దేవుడిచ్చే సర్వాంగ కవచాన్ని ధరించాలి. మన మట్టుకు మనము సాతాను తంత్రములను, పన్నాగములను ఎదుర్కొనలేము కానీ ఆ పోరాటానికి ప్రభువు ఒక కవచాన్ని అనుగ్రహించాడు. – ఎఫెసీ 6:11-18. ఈ సర్వాంగ కవచములో – సత్యమనే దట్టి, నీతియను మైమరువు, సిద్ధమనస్సు అనే జోడు, విశ్వాసమనే డాలు, రక్షణ అనే శిరస్త్రాణము, వాక్యమనే ఖడ్గము, ప్రార్థన ఉంటాయి. సర్వాంగ కవచంలోని ప్రతిభాగమును ప్రార్థనా పూర్వకంగా ధరించాలి. ఈ కవచం ధరించగానే సరిపోదు, ప్రార్థన లేకుండా ఈ కవచం పనిచేయదు. అందుకే ప్రార్థనను ఎడతెగక, తీవ్రతతో, నిస్వార్థంగా చేయాలి.

ఈ ఆత్మీయ పోరాటం అంధకారశక్తులకు ప్రభువు రాజ్య వారసులకు మధ్య జరిగే పోరాటం. దుష్టుని జయించే శక్తి దేవుడే సంఘానికి ఇచ్చాడు. సువార్త ద్వారా సాతాను దుర్గములను పడద్రోయగలము. సాతాను శక్తులు బలమైనవి, దుష్టమైనవి, యుక్తిగలవి అయినప్పటికీ, వాటిని జయించడానికి లోకంలో దేవుడు వాడుకునే సాధనాలే, విశ్వాసులు. అపవాదియొక్క క్రియలను లయపరచుటకు మనుష్యకుమారుడు ఈ లోకమునకు వచ్చాడు.ఆ పనిని కొనసాగించే కృపను ఆయన విశ్వాసులకు అప్పగించాడు. మన ప్రభువు సిలువలో సాతానుని జయించాడు. వాడు ఓడించబడిన శత్రువు. వాడి అంతము నిర్ణయించబడినది. ప్రకటన 12:10; 20:10. గనుక వాడికి భయపడకుండా, ధైర్యంతో వాడిని ఎదిరించాలి.

## సాతాను, పాపం మీద విజయం ఎలా?

- ఎడతెగని దైవ సహవాసము, దేవుని సన్నిధిని అభ్యాసము చేయడము (ఆది 19:27;17:1)
- దేవుని యెదుట మనుష్యుల ఎదుట మంచి మనస్సాక్షి కలిగి ఉండాలి (అపొ.కా 24:16)
- ప్రతి విధమైన పాపమునకు దూరముగా ఉండాలి (1 థెస్స 5:22)
- ప్రతిదినము సిలువనెత్తుకొని దేవునికి ప్రతిష్టించుకోవాలి. – స్వార్థంతో జీవించడం విడిచిపెట్టి, యధార్థత కలిగి ఉండాలి
- సాతానుకు చోటివ్వొద్దు (ఎఫెసీ4:27)
- భయభక్తులు గలిగిన జీవితం కలిగి దేవుని వాగ్దానాలను విశ్వాసంతో స్వతంత్రించుకోవాలి (2 పేతు 1:4).
- దేవుడిచ్చిన ఆత్మీయ అధికారాన్ని వినియోగించాలి (కొలస్సీ 3:15)
- పరిశుద్ధాత్మ దేవునికి లోబడి, ప్రభువు పునరుత్థాన శక్తిని విశ్వాసంతో అన్వయించుకో (ఎఫెసీ 5:19)
- ప్రభువు దగ్గర ఒప్పుకోని పాపం ఏదైనావుంటే సరిచేసుకో (కీర్తన 139:23,24)
- ఆయన అధికారులను, ప్రధానులను నిరాయుధులను చేసి, వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనబరచెనని గుర్తుంచుకో (కొలస్సీ 2: 15).

## జయించు వారికి కలిగే ఆత్మీయ ఆశీర్వాదాలు

పాపం మీద విజయము, దేవునికి మహిమ కలుగుతుంది. మన విశ్వాసము బలపడుతుంది, సాక్ష్య జీవితము ప్రభావముతో ఉంటుంది. దేవుని చేతిలో గొప్ప సాధనాలవుతాము, మన పరిచర్య శక్తివంతంగా ఉంటుంది. ఆయన పునరుత్థాన శక్తిని వ్యక్తిగతంగా అనుభవిస్తాము. మంచి కౌన్సిలర్స్‌గా, మెంటర్స్‌గా ఉంటాము. దేవుని ప్రేమను, రెండింతల ఆశీర్వాదాలు బహుమానముగా పొందుతాము.

ఈ శోధనలు మనలను ఆత్మీయంగా బలపరిచే సాధనాలుగా ప్రభువు వాడుకుంటాడు. ఒక్కొక్క శోధన గెలిచి నిలిచేకొద్ది, విశ్వాస జీవితంలో పరీక్షలు పాసై పై తరగతికి వెళ్తాము. నిత్యరాజ్యంలో ప్రభువుతో కూడా పరిపాలించడానికి ఇది మనకు సిద్ధపాటు.

**– యం.యస్. రవికుమార్,** నెల్లూరు



# మీరు లోకానికి ఉప్పు

క్రైస్తవులుగా మనం ప్రపంచం మీద ప్రభావం చూపించాలి. మత్తయి 5:13-16 వచనాలలో యేసుక్రీస్తు క్రైస్తవ ప్రభావం గురించి మాట్లాడుతూ, క్రైస్తవుని బాధ్యత కూడా తెలియజేస్తున్నాడు. ధన్యతల ప్రకారం జీవించే క్రైస్తవుడు ప్రపంచాన్ని ఉప్పు, వెలుగు వలే ప్రభావితం చేయాలని ప్రభువు చెబుతున్నాడు. తాత్వికంగా చెప్పాలంటే ఏ వ్యక్తి కూడా ద్వీప వాసి కాదు, సమాజంలో భాగం. గనుక ఈ చీకటి సమాజంలో ఒక క్రైస్తవుడు ఉప్పులా, వెలుగులా జీవించాలి. 'మీరు లోకానికి ఉప్పు' అని యేసు చెప్పిన మాటల్ని ఈ వ్యాసములో అర్థం చేసుకుందాం.

**ప్రాముఖ్యత**

యేసుక్రీస్తు ప్రభువు ఒక వాస్తవం గురించి మాట్లాడుతున్నాడు. "మీరు లోకానికి ఉప్పుగా ఉంటారని" ఒక సలహా ఇవ్వడం లేదు గానీ, "మీరు లోకానికి ఉప్పయియున్నారని" ఒక ప్రకటన చేస్తున్నాడు. 'మీరు లోకానికి ఉప్పు అని చెప్పినప్పుడు లోకం దేన్ని సూచిస్తుంది? లోకము కుళ్ళి, కల్మషం, మలినంతో, అసహ్యంగా మారిన ధోరణిని స్పష్టంగా సూచిస్తుంది. మానవుల దేహంలో చెడు సూక్ష్మ జీవులు, సంక్రమించే క్రిములు ఉన్నాయి. ఒకవేళ వాటిని నియంత్రించక పోతే రోగాన్ని కలిగిస్తాయి. అలాగే కుళ్ళిన, కల్మషంతో నిండిన లోకాన్ని బాగు చేయకపోతే అది నాశనమైపోతుంది. గనుక ఒక క్రైస్తవుడు ఉప్పులా లోకాన్ని బాగు చేయాల్సిన బాధ్యత ఉంది.

ప్రాచీన కాలములో ఉప్పు చాలా ప్రాముఖ్యమైనది. రోమన్ సైనికులకు ఉప్పును జీతంగా చెల్లించేవారు. దానిని వారు 'శాలరియం' అనేవారు. ఈ పదం నుంచే మనం వాడే 'శాలరీ' అనే పదము వచ్చింది. ప్రాచీన సమాజాలలో స్నేహానికి చిహ్నంగా ఉప్పును పరిగణించేవారు. ఈ భావన నేటికీ కొనసాగుతుంది. అరబ్ ప్రపంచంలో, ఒక వ్యక్తి మరొక మనిషి యొక్క ఉప్పులో పాలుపంచుకొంటే, అంటే అతనితో కలిసి భోజనం చేస్తే, అతను తన భద్రత, సంరక్షణలో ఉన్నట్లు అర్థము. ఒక మనిషి యొక్క భయంకరమైన శత్రువు తన గుడారంలోకి వచ్చి అతని ఉప్పు తింటే, అతడు తన ప్రియమైన స్నేహితునిగా ఎంచి అతన్ని రక్షించి, పోషించాల్సిన బాధ్యత అతను వహించాలి. నోటరీ విధానము లేని ప్రాచీన రోజుల్లో, ఇద్దరు వ్యక్తులు వ్యాపార ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పుడు, వారు ఒప్పందంపై ఏకాభిప్రాయం వచ్చే వరకు వారు నిబంధనలపై బేరసారాలు చేస్తారు. తర్వాత వారు ఉప్పు లేదా ఆహారాన్ని కలిసి తింటారు. ఉప్పు తినడాన్ని వారు ఉప్పు ఒడంబడిక అని పిలుస్తారు. ఈ ఒడంబడిక విచ్ఛిన్నం కాని ఒప్పందాన్ని ఏర్పాటు



ఒక మనిషి తాను నశించిపోతున్నట్లు గుర్తిస్తేనే అతనికి రక్షణ పొందాలనే ఆశ కలుగుతుంది. ఒక వ్యక్తి తాను భక్తిహీనుడనని గుర్తిస్తేనే అతనికి దైవభక్తి పట్ల కోరిక కలుగుతుంది. ఒక వ్యక్తి తాను దేవుని నుంచి వేరయ్యానని గుర్తిస్తేనే ఆయన దగ్గరకు రావాలనే ఆశ కలుగుతుంది. దేవుడు విశ్వాసులను రక్షణ పొందని మనుష్యుల మధ్యలో ఉంచింది వారిలో దేవుని పట్ల ఇటువంటి ఆకలిని పుట్టించేలా చేయడం కోసమే. యేసుక్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు ప్రజలలో దేవుని పట్ల దప్పికను కలిగించాడు.

చేస్తుంది. అర్పణలలో అవసరమైన భాగంగా దేవుడు ఉప్పును సూచించాడు. అర్పణ సంపూర్ణతను కోరుతుంది, ఉప్పులేని అర్పణ అసంపూర్ణంగా ఉంటుంది. గ్రీకులు ఉప్పును దైవంగా భావించేవారు. ఆహారంలో ఉప్పు లేకపోతే భర్త భార్యకు విడాకులిచ్చే అవకాశం యూదుల మధ్య ఉంది. యూదులు శిశువు పుట్టిన వెంటనే అతని శరీరము మీద ఉప్పును రుద్దేవారు. రోమా సైనికుడు సరిగా బాధ్యతలు నెరవేర్చకపోతే అతనిని ఉప్పుకు అర్హుడు కాదని అనేవారు.

## ప్రభావము

తన శిష్యులు సార్వత్రికంగా మానవాళిని ప్రభావితం చేస్తారని యేసు చెబుతున్నాడు. ఆయన తన అనుచరులపై అసాధారణమైన నమ్మకాన్ని కలిగి "మీరు ప్రపంచానికి ఉప్పులా ఉంటారనే" విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాడు. ఇది సాధారణమైన సంగతేమీ కాదు. ఎందుకంటే ప్రారంభంలో ఆయన శిష్యులు, అనుచరులు ఎన్నో లోపాలు, అస్థిరత కలిగి ఉన్నారు. తర్వాత ఆయన మాటకు సంపూర్ణ విధేయత చూపించి ఉప్పువలె జీవిస్తూ ఆయన ఉద్దేశ్యాన్ని నెరవేర్చారు. ఉప్పు చేసే పనులను, లక్షణాలను గమనిస్తే మనం కూడా లోకాన్ని ఎలా ప్రభావితం చేయగలమనే విషయాల్ని గ్రహించడానికి వీలవుతుంది.

### 1. పవిత్రతకు గుర్తు

ఉప్పు రంగు తెలుపు. దీన్ని పవిత్రతకు గుర్తుగా పరిగణించే వారు. మిగిలిన పదార్థాలన్నిటి కంటే ఇది భిన్నముగా ఉంటుంది. ఒక క్రైస్తవుడు ఉప్పువలె లోకంలో జీవించడమంటే క్రీస్తును పోలిన పరిశుద్ధ జీవితాన్ని ఈ లోకములో జీవించడమే. మన మాటలలో, చూపులలో పనులలో పరిశుద్ధత ఉండాలి. మన ఆలోచన, మాట, పనిలో దైవిక ప్రమాణాన్ని నిలబెట్టాలి. కొంతమంది క్రైస్తవులు నిమ్మరసంలో బాప్తీస్మం తీసుకున్నట్లు లోకపు పులుపుతోనే జీవిస్తారు. మనలను పరిశీలిస్తున్న లోకము ఎదుట మనము మన సాక్ష్యాలను కాపాడుకోవడానికి తీవ్రంగా ప్రయాసపడాలి. మన సాక్ష్యాన్ని దెబ్బతీసే, దేవుని వాక్య సత్యంపై సందేహాన్ని కలిగించే ప్రవర్తన, పనుల పట్ల మనం జాగ్రత్త వహించాలి. మన జీవితాలు మనవి కావు – మనము క్రీస్తుకు చెందిన వారం. ఆయన రాజ్యము కోసం క్రీస్తు సాధనాలుగా ఉండాలి. స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటూ, ప్రత్యేకంగా, ఉపయోగకరంగా ఉండడమే మన బాధ్యత. మన చుట్టూ ఉన్న విపరీతమైన చెడుకు వ్యతిరేకంగా మనం ఏమైనా ప్రభావం చూపించాలంటే, మనం మాట్లాడే, వ్యవహరించే, జీవిస్తున్న విధానంలో అందరితో, అన్నిటితో రాజీపడకుండా ప్రత్యేకంగా జీవించాలి. ఉప్పు ప్రభావవంతంగా ఉండడానికి అది ప్రభావితం చేసే పదార్థంతో కలిసి ఉండాలి, అయినప్పటికీ ఉప్పు ఆ పదార్థం నుండి భిన్నంగా ఉంటుంది. మనం ప్రత్యేకముగా ఉండాలని యేసు చెబుతున్నాడు.

### 2. రుచినిస్తుంది

ఉప్పు యొక్క మరొక పని రుచినివ్వడం లేదా

ఆహారం చప్పగా ఉండకుండా చేయడం. క్రీస్తు లేని జీవితం నిస్సారమైనదనే విషయాన్ని ప్రపంచం నిరూపిస్తుంది. ప్రజల జీవితాల్ని గమనిస్తే నిస్తేజంగా, విసుగ్గా, నిరాశగా ఉండడాన్ని గమనిస్తాం. అందుకనే వారు వినోదం కోసం పరుగులెత్తుతున్నారు. 2020-2021 సంవత్సరములో మన దేశానికి వినోదం ద్వారా ఒక లక్ష ముప్పై వేలకోట్ల ఆదాయం వచ్చింది. కానీ క్రైస్తవుడికి ఈ లోక సంబంధమైన వినోదాలు అవసరం లేదు ఎందుకంటే అతనికి జీవితంలో 'క్రైస్తవ విశ్వాసం' అనే సారము ఉంది. 2019 - 2020 సం॥ లెక్కల ప్రకారం ప్రతిరోజూ సగటున ఒక వ్యక్తి రోజుకు 145 నిమిషాలు సోషల్ మీడియా కోసం ఉపయోగిస్తున్నాడు. కాబట్టి క్రైస్తవులమైన మనము నిస్సారమైన అవిశ్వాసుల జీవితాలలో రుచిని కలిగించే వారిగా ఉండాలి. వారి జీవితాలలో ఉన్న శూన్యతను పూడ్చే క్రీస్తును వారికి పరిచయం చేసి వారి జీవితాలకు రుచిని చేకూర్చాలి. మనము ప్రపంచంలో జీవిస్తున్నాము, మన జీవితాలు ప్రపంచానికి రుచినివ్వాలి.

### 3. దప్పికను కలిగిస్తుంది


ఆహారంలో ఉప్పు లేకపోతే, నీరు సక్రమంగా తీసుకోలేము, నీరు సక్రమంగా తీసుకోకపోతే డీహైడ్రేషన్ వలన రోగము లేదా మరణము సంభవించవచ్చు. ప్రభువు మాట్లాడుతున్న ఈ మాటలు ఎడారి దేశాలకు చక్కగా వర్తిస్తాయి. ప్రయాణీకుడు సరైన మోతాదులో నీరు తీసుకోకపోతే, అతను ప్రయాణించేటప్పుడు డీహైడ్రేషన్‌కు గురై మరణిస్తాడు. ఈ విషయం మనకు తెలుసు. వేసవిలో ఎక్కువగా పని చేసేవారు, ఆటలు ఆడేవారు ఉప్పు మాత్రలను ఉపయోగిస్తారు. ఆ మాత్రలు ప్రమాదకరమైన డీహైడ్రేషన్‌ను నివారించి దాహాన్ని కలిగిస్తాయి. మన ప్రభువు "మీరు లోకానికి ఉప్పు" అని చెప్పినప్పుడు, ఆయన వారిని ఈ లోకంలో ఉంచానని చెప్తున్నాడు, తద్వారా జీవ జలపు ఊట గురించి తెలియక చనిపోతున్న వారిలో దప్పికను కలిగించాలి. జీవజలమైన యేసుక్రీస్తు కోసం దాహం కలిగేలా చేయడం విశ్వాసి యొక్క కర్తవ్యం. మన ప్రవర్తన, జీవితం విద్యార్థుల్లో, ప్రజలలో యేసుక్రీస్తు కొరకు దప్పికను కలిగించాలి. దాహము లేకపోతే నీరు త్రాగడం ఉండదు, నీరు త్రాగకపోతే జీవముండదు.

ఒక మనిషి తాను నశించి పోతున్నట్లు గుర్తిస్తేనే అతనికి రక్షణ పొందాలనే ఆశ కలుగుతుంది. ఒక వ్యక్తి తాను భక్తిహీనుడనని గుర్తిస్తేనే అతనికి దైవభక్తి పట్ల కోరిక కలుగుతుంది. ఒక వ్యక్తి తాను దేవుని నుంచి వేరయ్యానని గుర్తిస్తేనే ఆయన దగ్గరకు రావాలనే ఆశ కలుగుతుంది. దేవుడు విశ్వాసులను రక్షణ పొందని మనుష్యుల మధ్యలో ఉంచింది వారిలో దేవుని పట్ల ఇటువంటి ఆకలిని పుట్టించేలా చేయడం కోసమే. యేసుక్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు ప్రజలలో దేవుని పట్ల దప్పికను కలిగించాడు. మనం కూడా మన దగ్గరకు వచ్చే విద్యార్థులు, ప్రజలు 'మీలో ఉన్న ఆనందానికి, ప్రత్యేకతకు కారణమైన యేసును మాకు పరిచయం చేస్తారా?' అని మనలను అడిగేటట్లు జీవించాలి. అలా అవిశ్వాసులలో ఆధ్యాత్మిక దాహాన్ని కలిగించే జీవితం మనము జీవించాలి.

### 4. పదార్థాలు చెడిపోకుండా ఉంచుతుంది

చెడును, దుష్టత్వాన్ని నిరోధించడానికి దేవుడు మనల్ని ఈ సమాజంలో ఉంచాడు. మాంసం కుళ్ళిపోకుండా ఉండడానికి దానికి ఉప్పును రుద్దేవారు. మనము ఈ లోకానికి కుళ్ళు పట్టనియ్యకుండా, చెడిపోకుండా ఉండేలా చూడాలి. మన ఉనికి ప్రజలు ఆలోచించే విధంగా ప్రభావితం చేయాలి. నైతిక ప్రమాణాలు తక్కువగా ఉన్న, నిరంతరం మారుతున్న, లేదా విలువలు లేని ప్రపంచంలో నైతికంగా పతనమవ్వకుండా ఉండేటట్లు క్రైస్తవులు చూడాలి. వస్తువులు చెడిపోకుండా భద్రపరిచే గుణం ఉప్పుకున్నట్లు క్రైస్తవుడు ఇతరులు చెడిపోకుండా భద్రపరచే జీవితం కలిగి ఉండాలనేది క్రీస్తు బోధ సారాంశం. మన క్లాస్‌రూమ్‌లో, హాస్టల్లో లేదా మనము ఉండే ప్రదేశాల్లో అసభ్యకరమైన సంభాషణ జరుగుతున్నప్పుడు మనము అక్కడకు వెళ్ళగానే ఆ సంభాషణ మారాలి. కొంతమంది క్రైస్తవుల జీవితాలను చూస్తే, వారు అక్కడ ఉంటే నేరాలు, అవినీతి తగ్గి నిజాయితీగా ప్రవర్తించడం మొదలై, నిస్తేజమైన వ్యక్తుల మనస్సాక్షిని పురికొల్పి, నైతిక వాతావరణాన్ని పెంచుతారు.

విలియం కేరీ మన దేశానికి మిషనరీగా వచ్చి దేశంలో ఉన్న అనేకమైన అనాగరిక, చెడ్డ సాంప్రదాయాలనుంచి ప్రజలను కాపాడాడు. జాన్ వెస్లీ ఇంగ్లండ్ దేశంలోని ప్రజలు భయంకరమైన



త్రాగుడు, వ్యభిచారం అనే వాటిలో కుళ్ళిపోకుండా వారి జీవితాలను మార్చాడు. మనము ఉండే ప్రదేశాలలో మన ఉనికి చెడును, నేరాన్ని, అశ్లీలతను నిరోధించ లేకపోతే మనము ఉప్పువలె జీవించనట్లే లెక్క. మన ప్రభువైన యేసుక్రీస్తుతో మనము అనుభవిస్తున్న సంబంధాన్ని బట్టి మనము సమాజములో పరిశుద్ధతను పెంపొందించడానికి దోహదపడాలి.

### 5. నొప్పి కలిగిస్తుంది

వైద్యపరంగా ఉప్పును గాయంలో ఉంచినప్పుడు నొప్పి కలిగి స్వస్థపరచే గుణం కలిగియుంటుంది. విశ్వాసులంగా మనం కూడా ఎక్కడయితే సమస్య ఉందని గుర్తిస్తామో అక్కడికి వెళ్లి చెడు విషయమై వారి మనస్సాక్షిలో నొప్పిని కలిగించి అక్కడ ఉన్నవారు అది తప్పు అని గుర్తించగలిగేటట్లు చేయాలి. వ్యాసాలు రాయడం, చర్చల్లో పాల్గొనడం ద్వారా, కాలేజ్ జర్నల్‌లో ఆర్టికల్స్ రాయడం ద్వారా ప్రపంచం తన దుర్నీతిని, చెడును గుర్తించేలా చేయాలి. మన ఉనికి పాపాన్ని ఖండించేదిగా ఉండాలి. మన పరిశుద్ధ జీవితము అవిశ్వాసుల పాపము విషయమై వారికి నొప్పిని కలిగించాలి.

### 6. తన ఉనికిని చాటుతుంది

ఉప్పు డబ్బాల్లో, సంచుల్లో సంవత్సరాలు ఉండొచ్చు, కాని దాన్ని వాడితేనే అది చొచ్చుకొనిపోయి దాని ఉనికి చాటేది. మనలో ఉన్న క్రీస్తు ఆత్మ ద్వారా బలం పొంది మనం సమాజంలోకి చొచ్చుకొనిపోవాలి. మన కళాశాలల్లో, వసతిగృహాల్లో, క్లాస్ రూమ్స్‌లో రాజకీయాలలో, ప్రపంచ వ్యవహారాలలో పాల్గొనాలి. మన ఉనికి సమాజానికి తెలియాలి. ఉప్పు కరిగిపోయి తన శక్తిని, ప్రభావాన్ని వెదజల్లుతుంది.

ఉప్పు దేనిలోనైనా కలపక ముందు కనబడుతుంది, తరువాత అది కనబడకపోయినా దాని ప్రభావాన్ని మాత్రము చూపిస్తుంది. కొద్ది మొత్తములో ఉన్న ఉప్పు కూడా ఎక్కువ ద్రవ్యరాశిలో తన ప్రభావాన్ని చూపుతుంది . మనము గృహాలలో, కార్యాలయాల్లో, కళాశాలల్లో ఎక్కడ ఉన్నా అక్కడ మన ప్రభావాన్ని తప్పకుండా చూపించాలి.

### 7. ప్రమాదము

ఉప్పు నిస్సారమైతే ఏమి ప్రయోజనము అని యేసు అంటున్నాడు. ఉప్పు స్వతహాగా తన సారాన్ని కోల్పోదు, స్వభావసిద్ధంగా ఉప్పు అనేది చాలా సంక్లిష్టమైన రసాయనిక పదార్థము. అయితే ఉప్పు ఇతర కలుషితాలు, అవాంఛనీయ పదార్థాలతో కలిస్తే అది తన సారాన్ని కోల్పోతుంది. అలాగే మనము కూడా ఈ లోకములో ఉన్న పాపము అనే కలుషితాన్ని మనకు అంటించుకొన్నట్లయితే మన క్రైస్తవ ప్రభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రజల రక్షణకు కారకులుగా ఉండాల్సిన మనం నిస్సారమై పనికిమాలిన వారమవుతాము.

### ముగింపు

ప్రపంచానికి సమస్య ఏంటి అనే ప్రశ్న మనం అడగకూడదు. ఎందుకంటే రోగ నిర్ధారణ ముందే జరిగింది. దానికి బదులుగా ఉప్పు మరియు వెలుగుగా ఉండాల్సిన మనం ఎందుకిలా ఉన్నాము? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. లోకాన్ని మనము వేడి చేయకపోతే లోకము మనలను గడ్డకట్టిస్తుంది. లోకము మీద మనము ప్రభావము చూపించకపోతే, లోకము మనమీద ప్రభావము చూపిస్తుంది. జాన్‌స్టాట్ అనే భక్తుడు “ప్రార్థన, సత్యాన్ని ప్రకటించడము, మాదిరిగా ఉండడము, సమూహ ఐక్యత ద్వారా ప్రపంచాన్ని క్రైస్తవులు ప్రభావితము చేయగలరని” చెబుతాడు. ఈ లోకపు మలినాన్ని అంటించుకోకుండా లోకము మీద ప్రభువు సహాయముతో గొప్ప ప్రభావాన్ని చూపించడానికి సిద్ధపడదాం. దేవుడు మనకు అటువంటి కృపనిచ్చి బలపరచును గాక ఆమెన్.

– పి. నాసరయ్య, ఏయు జోన్, విశాఖపట్నం





# కన్నులనెత్తి పైరుల చూడు

"పరిచర్యలో ఎలాగూ వెనకబడుతున్నాం. కనీసం ప్రార్థనలో అయినా ముందుందాం" అన్నాడు రాజు.

అందరూ అతని వైపు చూశారు.

"ఏదో చేశామన్న పేరుకి చేస్తున్నాం తప్ప అందులో నిబద్ధత లేదు. యాంత్రికంగా హాస్టల్స్‌కి వెళ్ళడం, బైబిల్ స్టడీ తీసుకోవడం, పిల్లలతో కాసేపు మాట్లాడడం వరకు బాగానే ఉంది కానీ తగినంత సిద్ధపాటు లేదు. దానికి తగ్గట్టుగా ప్రార్థన కూడా ఉండడం లేదు" అన్నాడు రాజు.

"నువ్వు చెప్పేది వింతగా ఉందన్నా. జీవితం రోజురోజుకీ ఎంత గందరగోళంగా తయారవుతుందో మనందరికీ తెలుసు. చేసే పనిలో ఒత్తిడి పెరిగి పోతుంది. అలాంటి పరిస్థితుల్లో కూడా ఎక్కడా పరిచర్యను నిర్లక్ష్యం చేయట్లేదు. సోమవారం యంపిసిలు, బుధవారం బైబిల్ స్టడీలు, గురువారం ఇజియఫ్, ఇవి కాక ఇసి, డిటి, యల్టీ క్యాంప్‌లు, కాన్ఫరెన్స్‌లు, ప్రత్యేక ప్రోగ్రామ్‌లు, ఆన్‌లైన్ మీటింగ్స్... ఇలా అన్నిటికీ అటెండ్ అవుతూనే ఉన్నాం. నేర్చుకుంటూనే ఉన్నాం, ప్రార్థిస్తూనే ఉన్నాం. అయినా నువ్వు ఇలా మాట్లాడడం ఏమీ బాగోలేదు" అన్నాడు కుమార్.

"నేనేమీ తప్పు పట్టడం లేదన్నా. మన పనుల్ని, మనకున్న పరిచయాల్ని పక్కన పెట్టి విద్యార్థుల కోసం కష్టపడుతున్నాం. అయినా పరిచర్యలో నానాటికీ నాణ్యత తగ్గుతుంది అంటున్నాను. మన ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒక ఆర్థిక సమస్యో, అనారోగ్య సమస్యో ఉంటూనే ఉంటుంది. మన ప్రార్థనలన్నీ వాటిని సరి చేసుకోవడానికే సరిపోతున్నాయి. ఇక విద్యార్థుల గురించి, వాళ్ళను నిలబెట్టడం గురించి మన ప్రార్థన సరిపోవడం లేదని మాత్రమే చెబుతున్నాను" అన్నాడు రాజు.

"అంటే... వ్యక్తిగత అవసరాల కోసం ప్రార్థించడం తప్పని అంటున్నావా అన్నా! మనం ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుంటేనే కదా విద్యార్థుల్ని తీర్చిదిద్దగలం" అన్నాడు కుమార్.

"అన్నా... నన్ను అపార్థం చేసుకోకండి. మన ప్రార్థన వ్యక్తిగత సమస్యలు, అవసరాలు చుట్టూనే కాకుండా మన చుట్టూ ఉన్న సమాజం కోసం కూడా చేయాలి. భారం, బాధ్యత లేని ప్రార్థన వల్ల అంతగా ఉపయోగం ఉండదు కదా" అన్నాడు రాజు.

"అలా ఎందుకంటావన్నా! ప్రతి నెలలో ఉపవాస ప్రార్థన చేస్తూనే ఉన్నాం. అందులో దేశ నాయకుల గురించి, రాష్ట్ర నాయకుల గురించి, చుట్టూ ఉన్న సమాజం గురించి ప్రార్థిస్తూనే ఉన్నాం కదా" అన్నాడు కుమార్.

"నేను అదే చెప్తున్నాను అన్నా. వీటన్నిటి గురించి మనం ప్రార్థిస్తూనే ఉన్నాం. అయితే కన్నీటి ప్రార్థనలు కనుమరుగవుతున్నాయి. ఉపవాస ప్రార్థనలు ఉత్సవ

**ఇప్పుడు అందరికీ అద్భుతాలు కావాలి, రాత్రికి రాత్రే తమ జీవితంలో అభివృద్ధి విస్తరించాలి. అంతే తప్ప తాను ఎంత పరిచర్య చేశాడో, ఎన్ని గంటలు ప్రార్థనలో గడిపాడో ఎవరూ గుర్తు చేసుకోవట్లేదు. నేనొక్కడినే పరిచర్య చేస్తున్నానని, ప్రార్థనాపరుడినని చెప్పకోవడం మనకు గొప్పగా అనిపిస్తుందేమో గానీ దేవుని దృష్టికి అది అల్పం.**

విగ్రహాలుగా మారిపోతున్నాయి. మోకాళ్ళ ప్రార్థనలు బలహీనపడి పోతున్నాయి. కాలేజీలో అడుగుపెట్టి అడిగే రోజులు పోయాయి. నాలుగ్గోడల మధ్య శరీరాన్ని నలగ్గొట్టుకొని వ్యక్తిగత సౌకర్యాల కోసం అడుక్కునే ప్రార్థనలు పెరిగిపోయాయి. ప్రార్థన అంటే కేవలం పెదాల కదలికలు మాత్రమే కాదుగా... దేవుని సన్నిధిలో మనల్ని మనం కుమ్మరించుకోవడం, దేవునితో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండటం కదూ" చెప్పి ఆగాడు రాజు.

గ్రాడ్యుయేట్స్ అందరూ వారిద్దరి వంక చూడసాగారు. ప్రతి గురువారం జరిగే ఇజియఫ్‌లో ఈ తరహా సంభాషణలు మామూలే అయినా కొన్నిసార్లు మాత్రం కొంత టెన్షన్‌ని క్రియేట్ చేయడం వారి అనుభవంలోనిదే. సమస్యకి పరిష్కారం ఎలా కనుగొనాలో అని చర్చ మొదలవుతుంది. నాలుగు గొంతులూ శృతి కలుపుతాయి. మాటా మాటా పెరుగుతుంది. చర్చగా మొదలైన సంభాషణ చప్పగానో, ఉప్పగానో మారుతుంది. మనస్తాపానికి దారి తీస్తుంది. మాట పట్టింపులకు, మూతి వంకర్లకు కారణమవుతుంది. దారిలో కనబడితే ప్రైజ్ ద లార్డ్ అని చెప్పకోవడం, అనుకోకుండా ఇంటికొస్తే ప్రేమలు ఒలకబోయడం మామూలవుతుంది. కానీ సమస్యలు పరిష్కారం కాకుండానే కాలగర్భంలో కలిసి పోతాయి.

"అన్నా అక్కలందరూ నన్ను మన్నించాలి. ఎవర్నీ నొప్పించడానికి నేనిలా మాట్లాడడం లేదు. ప్రతికూల పరిస్థితులున్నప్పుడే మన పూర్వీకులు ఎంతో పరిచర్య చేసారు. 'ప్రభువా ఆంధ్రాను నాకివ్వు, లేదంటే నా ప్రాణం తీసుకో' అని ప్రార్థన చేశారు. మరి ఇన్ని సౌకర్యాలు వచ్చాక మనమెందుకు అలసత్వంతో ఉంటున్నామన్నదే నా బాధ. పుట్టగొడుగుల్లా ఎక్కడ చూసినా కాలేజీలు పుట్టుకొస్తున్నాయి. వర్కింగ్ హాస్టల్లోనో, వసతి గృహాల్లోనో తామర తంపరలా విద్యార్థులు పెరుగుతున్నారు. వీళ్ళల్లో దేవునిని ఎరిగిన వాళ్ళు ఎంతమంది? దేవునిలో ఎదుగుతున్న వాళ్ళు ఎంతమంది? లోకంలోనో, పాపంలోనో జీవిస్తూ ప్రాణాలు కోల్పోతున్న వాళ్ళెంతమంది? వాళ్ళ కోసం ప్రార్థన చేయాల్సిన భారం మన మీద ఉంది. ఆ విషయం గుర్తు చేయాలనే నేనింత సేపు మాట్లాడాను" అన్నాడు.

కాసేపు నిశ్శబ్దం. అందరిలోనూ ఏదో తెలియని అపరాధ భావం. జీవితాన్ని జీతాలతో లెక్కేసుకుంటూ, ఆదాయంతో ఆయుర్దాయాన్ని పెంచుకోడానికి తాపత్రయ పడుతున్నారే గానీ ప్రభువు లెక్కడిగితే ఏమని సమాధానం చెప్తారు, రాత్రికి రాత్రే ప్రాణాలిమ్మంటే ఎంతమంది ముందుకొస్తారు? మోషే ప్రార్థిస్తే మన్నా కురిసింది. పౌలు సీలలు ప్రార్థిస్తే చెరసాల బద్దలైంది. మరి మనం ప్రార్థిస్తే కనీసం గుండెలైనా బద్దలవుతున్నాయా? మన ప్రార్థనలో పట్టుదల లేదు. మనం అడిగేవి నెరవేరతాయనే విశ్వాసం లేదు. మొక్కుబడి ప్రార్థన చేసీ చేసీ జీవితం యాంత్రికంగా తయారైంది.

ఇజియఫ్ మొదలయ్యింది. విద్యార్థి గీతావళి నుంచి 'కన్నులనెత్తి పైరుల చూడు కోయగ లేరెవ్వరు' అనే పాట పాడసాగారు. ఒక్కో చరణం పాడుతున్నప్పుడల్లా తమ జీవితం కళ్ళ ముందు కదలాడసాగింది. ఇంత చేశాను, అంత చేశాను అనే లెక్కల ముందు చేయాల్సింది ఎంత ఉందో అవగాహనలోకి వచ్చింది. గడిచిన జీవిత ప్రయాణమంతా వెదుకులాటలు, పరుగులాటలతోనే అలసిపోయింది. ఎక్కడా ఆగాలనిపించదు, ఆయాసం తీర్చుకోవాలనిపించదు. అందినంతా జుర్రుకోవాలనే వెర్రి ఆరాటం ఒకచోట



నిలబడి నీళ్ళు తాగనివ్వదు. దాని దృష్టంతా పరుగెత్తి పాలుతాగడం మీదే!

మందిరాలు కూలిపోతున్నాయి, పట్టణాలు ప్రాకారాలు పడగొట్టబడుతున్నాయి. స్వచ్ఛమైన వాక్యాన్ని మరుగుపర్చి అసత్యాన్ని సత్యంలా ప్రచారం చేయాలనే ఆలోచన ఊరేగుతోంది. బైబిల్ పట్టుకున్నా, పరిచర్య కొనసాగించినా ఎన్నో వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొనే దుర్దినాలు దాపురించాయి. మతాధిపత్యం పెరిగిపోయింది. కుల జాఢ్యం చాప కింద నీరులా విస్తరిస్తుంది. జాతుల మీద జాతులు, దేశాల మీద దేశాలు యుద్ధాలకు తెగబడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మందుడిగా ఉండడం మనకు క్షేమం కాదు. సరంబీ గృహాలలో సంతోషించే సమయం ఇది కాదు. ద్రవ్యాన్ని, వస్త్రాల్ని, తోటల్ని సంపాదించుకోవడానికి ఇది అనుకూల కాలం కాదు.

రాజు గొంతు సవరించుకున్నాడు. అందరికీ వందనాలు చెప్పి "రానురానూ వాక్య బోధన కొత్తదారులు తొక్కుతుంది. ఊహించని మలుపులతో ప్రయాణిస్తుంది. ఇప్పుడు అందరికీ అద్భుతాలు కావాలి, రాత్రికి రాత్రే తమ జీవితంలో అభివృద్ధి విస్తరించాలి. అంతే తప్ప తాను ఎంత పరిచర్య చేశాడో, ఎన్ని గంటలు ప్రార్థనలో గడిపాడో ఎవరూ గుర్తు చేసుకోవట్లేదు. నేనొక్కడినే పరిచర్య చేస్తున్నానని, ప్రార్థనాపరుడినని చెప్పుకోవడం మనకు గొప్పగా అనిపిస్తుందేమో గానీ దేవుని దృష్టికి అది అల్పం. మన ప్రార్థనా సమయాన్ని పెంచుకోవాలి. చేయి చేయి పట్టి సంఘ క్షేమం కొరకు ఎడతెగక ప్రార్థించాలి. మన పూర్వీకులు మనకిచ్చిన విద్యార్థి పరిచర్యను విజయవంతంగా నడిపించడంలో ప్రార్థనా శక్తిని మనం వాడుకోవాలి. కోత విస్తారంగా ఉంది. పనివారు కొదవవుతున్నారు. దానికోసం మనం పట్టుదలతో ప్రార్థించాలి" అంటూ ముగించాడు.

"దినములోన చేసిన సేవ – దైవ చిత్తముకు సరిపోవ దీనుడవయి ఒంటిగ కొండను చేసిన – ప్రార్థన నేర్పుమయా" 'ప్రార్థన వినెడి పావనుడా ప్రార్థన మాకు నేర్పుమయా' పాటను పెద్దగా పాడడం మొదలు పెట్టాడు ఆనంద్. అక్కడున్న వారంతా మోకాళ్ళ మీద కూర్చుని చేయి చేయి పట్టుకొని ప్రార్థన చేయడానికి సిద్ధమయ్యారు.

– **జడా. సుబ్బారావు,** నూజివీడు




# వరదల్లో - విలవిల

వాతావరణ హెచ్చరికలు–వానలు వరదలు
వరదలు ముంచెత్తె – విజయవాడ నగరాన్ని
వాడవాడలా – నీటి ప్రవాహాలు
వారం రోజులుగా – వరదలలోనే జనులు

ఆక్రందనలు – ఆర్తనాదాలు
ఆకలి కేకలు – ఆహారం కోసం
అల్లాడుచున్న – ప్రాణాలు
ఆదుకొనే వారికోసం – ఎదురు చూపులు

నెమ్మది దొరకని – బ్రతుకులు
నీటమునిగిన – నివాసాలు
కోటీశ్వరులు సహా – కూటికోసం ఆరాటం
కలిమిగలవారు – కకావికలమయ్యె
పేద ప్రజలు – దయనీయ దుస్థితిలో ఉండే
కారుచీకట్లో – ఎన్నో రాత్రుళ్ళు

లోకులు–నెమ్మదిగా ఉంది భయమేమిలేదని
లోకంలో–చెప్పుకొనుచుండగా అకస్మాత్తుగా
లోకంమీదకి శ్రమలు వస్తాయి

లోకపు నటన – గతించునని
బైబిల్ గ్రంథము – ప్రకటించుచుండె
తోటి మానవులారా – కదలిరండి
తీవ్ర ఇబ్బందిలో నున్న – వరదబాధిత ప్రజలను
తట్టి ధైర్యాన్ని – నింపండి
త్రియేక దేవుని – ప్రేమను చూపించండి

యెహోవాకు పరిచర్య చేయు
యాజకులు – మంటపమునకును,
బలిపీఠమునకును మధ్య – నిలువబడి
యెహోవా – నీ జనుల యెడల
జాలి చేసుకొని వారిని – కాపాడమని వేడుకొనుడి

దేవుని యెడల – భయభక్తులు గలవారలారా
దేవుని సన్నిధిని – ప్రలాపించుడి, ప్రార్థించుడి
ఆంధ్రప్రదేశ్ – తెలంగాణా
రాష్ట్రాల కొరకు – దైవ సన్నిధిలో
ఆపదలోనున్న రాష్ట్రాలలోని – ప్రజల కొరకు
వరదబాధిత – ప్రాంతాల కొరకు
ప్రార్థించుడి ... ప్రార్థించుడి ...

– **యస్.సి.హెచ్. ఎలీషా,** నర్సరావుపేట

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 26-09-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ఏడు దశాబ్దాల సజీవ సాక్ష్యం
# యుఇయస్ఐ

ముక్కాళ్ల[1] పీఠంపై నిలిపిన ఆ చిరుదివ్వె
మూణ్ణాల్ల ముచ్చటగా మిగిలిపోక,
విద్యార్థి లోకాన్ని వెలిగించిందీ కరదీపిక.
ఒక మహోద్యమమై ప్రభవించి
మహా ప్రభంజనమయ్యింది.

వాక్యానికి పెద్దపీట వేస్తూ
శిష్యత్వమే గీటురాయిగా
సహవాసానికి చిరునామాగా మారింది
సువార్త విత్తనాలను వెదజల్లింది
ప్రేషిత సేవకు బాటలు వేసింది.

ప్రభువు సేవకులు పట్టభద్రులు[2] పెట్టని కోటగా
విద్యార్థి నాయకత్వం పరిఢవిల్లింది.
రాజకీయ రణరంగాలుగా మారిన ప్రాంగణాలు
సౌవార్తిక సాక్ష్యానికి పట్టుగొమ్మలయ్యాయి
శాంతి సుధలకు నిలయమయ్యాయి.

మనం మన పితరులు కన్న కలలం
అలుపెరుగక వారు నడచిన సేవాపొలాలం
తుప్పు పట్టడం కన్నా అరిగిపోవడం మేలని
ఎన్ని క్రొవ్వొత్తులు ప్రభువు కోసం కరిగిపోయాయో
ఎన్ని గోధుమ గింజలు భూమిలో కలిసిపోయాయో!

తరాలు మారుతున్నా, స్థిరమైనది
ఎన్ని తుఫానులు వచ్చినా
ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా
దీని పునాదులు పదిలం
స్థానిక ఇయూలే దీని బలం.

రోజులు మారుతున్నాయి
దర్శనం లేకుండా దర్పం ప్రదర్శిస్తూ
గోధుమలకన్నా గురుగులకు ప్రాధాన్యమిస్తూ
సిద్ధాంతాలను ప్రక్కనపెట్టి
పదవులకోసం రాద్ధాంతం చేసే దినాలివి
మెంటారింగ్ తగ్గి మేనేజింగ్ పెరుగుతున్న కాలమిది.

మౌళికాలకు తిలోదకాలిచ్చి
ఫెయిత్ పాలసీ పాత సంగతంటూ
ప్రార్థన విశ్వాసాల స్థానంలోకి
కూడికలూ తీసివేతలు
ప్లానింగ్‌లూ, పలుకుబడులు జొరబడుతున్నాయి.

ఎందరో మహామహుల త్యాగఫలం
ఏడు దశాబ్దాల సజీవ సాక్ష్యం
యుఇయస్ఐ ఉద్యమం!
కడదాకా కాపాడుకుందాం
ప్రభుని రాకడ వరకు నమ్మకంగా పనిచేద్దాం.

– యస్. సైమన్
హైదరాబాద్

1. వెల్లూరు, కోయంబత్తూరు, మద్రాసు
2. గ్రాడ్యుయేట్స్, స్టాఫ్